ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

జూలై 13, 2008

ఆరోగ్యం...అమ్మ...అన్నం...

# బోనాల వైనాలు

# హ్యాపీ బర్త్‌డే

(2008 జులై-13 నుంచి-2008 జులై-19వరకు)

జె.మౌనిక
7సం॥, జులై-13
కృష్ణవేణి-శ్రీనివాస్
ధర్మన్నగూడ-రంగారెడ్డి

స్పందన
4సం॥,జులై-2004
మాధవి-శ్రీనివాస్
హమీదుల్లానగర్-రంగారెడ్డి

ఎన్.నిఖిత
4సం॥, జులై-14
సంతోష-వెంకటేష్
ఆరుట్ల-రంగారెడ్డి

ఎన్.జగదీష్
6సం॥, జులై-13
సంతోష-వెంకటేష్
ఆరుట్ల-రంగారెడ్డి

స్నేహ(ప్రైజీ)
5సం॥, జులై-18
శోభారాణి-అరుణ్
కంభంపాడు-కృష్ణా

కవీన్
2సం॥, జులై-15
మాణిక్యమ్మ-మణిక్యయ్య
దామరగిద్ద-మ॥నగర్

# నిజాయితీ, నిబద్ధత ప్రధానం

## మన అతిథి

పేరు : ఆచార్య బీలా సత్యనారాయణ
తల్లిదండ్రులు : బాపునాయుడు, సత్యమమ్మ
స్వగ్రామం : జామి మండలం, తొండ్రంగి గ్రామం, విజయనగరం (జిల్లా)
పుట్టిన తేది : 1, జులై, 1948
విద్యార్హతలు : బిఇ (మెకానికల్), ఎంఇ (మిషన్ డిజైనింగ్), పిహెచ్‌డి
వృత్తి :1975లో భద్రాచలం పేపర్ మిల్లులో మెకానికల్ ఇంజనీర్
1978 నుంచి ఆంధ్రా యూనివర్సిటీ ఇంజనీరింగ్ విభాగంలో అధ్యాపకుడు, ప్రస్తుతం ఎయు వైస్‌ఛాన్సలర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.
ప్రవృత్తి : విద్యారంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రయత్నం.
కృషి : ఆయన రాసిన 94 పరిశోధనా పత్రాలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. 12 పిహెచ్‌డి థీసిస్‌లకు గైడ్‌గా వ్యవహరించారు. మెకానికల్ డిపార్టమెంట్‌కు హెడ్‌గా వ్యవహరించేటప్పుడు అనేక సదస్సులు నిర్వహించారు.
కోరుకుంటున్నది : నిరక్షరాస్యతను రూపుమాపాలి. అక్షరాస్యత మరింత పెరగాలి.
ప్రభావం చూపినవారు :పాఠశాల స్థాయి నుంచి కళాశాల స్థాయి వరకూ స్నేహితులు, కుటుంబ సభ్యుల క్రమశిక్షణ, సమాజ సేవ చేయాలన్న తపన నాపై ప్రభావం చూపాయి.
మరిచిపోలేని సంఘటనలు : చిన్నతనంలో ధాన్యం అమ్మి పేద పిల్లలకు సహాయం చేయడం, దళితులతో స్నేహం చేయడం, సహపంక్తి భోజనాలు చేయడం.

ఎవరైనా అభివృద్ధి చెందాలంటే నిజాయితీ, నిబద్ధత ఉండటం ప్రధానం. ఇవి రెండూ ఉంటే అంతా మంచిగానే జరుగుతుంది. ప్రతి ఒక్కరూ తమ వృత్తిని గౌరవించాలి. నిజాయితీని నమ్ముకునేవారెవరూ తనకు తెలిసినంతవరకూ తప్పు చేయరనేది నా ఫిలాసఫీ. ఉపాధ్యాయులు, అధ్యాపకులు తమ మేధాసంపత్తిని అందరికీ పంచాలి. ప్రతి ఒక్కరూ తన పని పట్ల తాను సంతృప్తి చెందగలిగేలా పనిచేస్తే సమాజం అభివృద్ధి చెందుతుంది. హైస్కూలు స్థాయిలో గురువుల నుంచి నేర్చుకున్న విలువలు నన్ను ఇప్పటికీ నడిపిస్తున్నాయి. వాటిని ఎన్నటికీ మరవను. బాలకార్మిక వ్యవస్థను రూపుమాపాలి. వీలైతే వారిని దత్తత తీసుకుని మంచి చదువు చెప్పించాలి. అంతేకాని వారితో వెట్టిచాకిరీ చేయించకూడదు. కట్నం ఇవ్వకూడదు.. తీసుకోకూడదు.. అనే అంశంపై అందరినీ ప్రోత్సహిస్తూ ఉంటాను. నేను కట్నం తీసుకోలేదు. నా పిల్లలకు కట్నం ఇవ్వలేదు. తీసుకోలేదు. అలాగే అందరూ వరకట్నం, వేధింపులు లేని సమాజం కోసం కృషి చేయాలి. మేనరికపు వివాహాల వల్ల పిల్లలకు అనర్థాలు వచ్చే అవకాశమున్నందున వాటికి దూరంగా ఉండాలి.



## ఈ సంచికలో....


టపా ... 2
ఆరోగ్యం ... 3
సీరియల్ ... 8
సినిమా ... 10
సిత్రం ... 11
బాలనేస్తాలు ... 12
అట్టమీది కథ ... 14


## ఇంకా...


మంచిపుస్తకం ...6
అవగాహన, అవలోకన








చూద్దామా ... 4
ఔరా! అనిపించే ఔరంగాబాద్

సలహాలు ... 17
లాహిరి... లాహిరి ... 20
మనసా... తెలుసా ... 22
రుచి ... 23
కొత్త పుస్తకాలు ... 24

తెలుసుకుందామా... 18
ఏజెన్సీలో ఏరువాక
(గిరిజనుల భూమిపూజ సంబరాలు)



## టీవీ కార్యక్రమాల పయనం ఎటు?

సీరియల్స్, సినిమాలు, ఆటలు, పాటలు మొదలైన కార్యక్రమాల్తో ప్రేక్షకుల్ని ఆకర్షిస్తూ ఎప్పటికప్పుడు నవీన కార్యక్రమాల్ని చేపడుతూ విజయపథాన పయనిస్తున్న టీవీ చానళ్ళ గురించి 29.6.08 నాటి ఆదివారం 'కవర్ స్టోరీ' ఆసక్తిని కలిగించింది. మొదట్లో ప్రజాప్రయోజనకర కార్యక్రమాలను నిర్మించి క్రమంగా వాణిజ్య విలువలకు ప్రాధాన్యతనిస్తూ ప్రేక్షకులకు ఆసక్తిని కల్గించే కార్యక్రమాలను నిర్వహించడం వల్ల టీవీ ఛానళ్లు దినదినాభివృద్ధి చెందాయన్న విషయాన్ని ఈ "అట్టమీదకథ" తెలియజేసింది. అలాగే, "చూద్దామా..." శీర్షికలోని రాజస్థాన్ రాజరికపు ఆస్థానం" వ్యాసం ద్వారా రాజస్థాన్‌లోని చారిత్రక ప్రదేశాల గురించి తెలుసుకున్నాం. "లాహిరి లాహిరిలో..." శీర్షికలో నాటి మేటి హీరోయిన్ వహీదా రెహమాన్ గురించి తెలుసుకున్నాం. ముఖ్యంగా "ఆరోగ్యం" శీర్షికలో మన శరీరంలో రోగ నిరోధక వ్యవస్థను పటిష్ట పరుచుకోడాన్ని గురించి ప్రతీ ఒక్కరికీ ఉపయోగకరమైన విషయాలను తెలియజేసినందుకు ధన్యవాదాలు.

**గొల్లమందల సురేష్ కుమార్,**
**సీతారాంపురం, ఖమ్మం.**

## జీవ ఇంధనం వద్దు

జీవ ఇంధనం గురించి విజ్ఞాన వీచిక వ్యాసం చాలా విషయాలు తెలియజేసింది. చమురు వినియోగం పెరిగింది. భూమి పొరల్లో లభిస్తున్న చమురు సంపద తరిగిపోతున్నందున జీవ ఇంధనం కొరకు ప్రయత్నించడం మంచిది కాదు. దానివలన ఆహార ఉత్పత్తులు తగ్గుతాయి. మత్స్య సంపద నాశనమవుతున్నది. ఆరోగ్యం గురించి వ్యాసం, రాజరికపు ఆస్థానం, రాజస్థాన్ వ్యాసం బావున్నాయి. ఫ్రంట్ లైన్ పత్రికలో వచ్చిన వ్యాసాలతో కూడిన పుస్తకం "ది రిఫ్లెక్షన్ ఆన్ అవర్ టైమ్స్" పుస్తక పరిచయం ఉద్యమకారులకు అవసరం.

**టి. శ్రీరామ్మూర్తి. గాజువాక,విశాఖ.**

## చూద్దామా బాగుంది

ఈ వారం కవర్ స్టోరీ ఆసక్తికరంగా ఉంది. "రాజస్థాన్ రాజరికపు ఆస్థానం" వ్యాసంలో రాచరిక చరిత్ర గురించి, అక్కడ చూడవలసిన ప్రదేశాల గురించి చక్కగా వివరించారు. ఆరోగ్యంలో రోగ నిరోధక వ్యవస్థ గురించి ఇచ్చిన వివరాలు ఉపయోగకరంగా ఉన్నాయి. బాల నేస్తాలు పేజీ బావుంది.

**భాస్కర్, హైదరాబాద్.**

## కవర్ చక్కగా వివరించారు

కవర్ పేజీ కథనం లో టీవీలు వచ్చిన ప్రారంభ దశలో ఉన్న ప్రసారాలకు, ప్రస్తుతం చేస్తున్న ప్రసారాలకు ఉన్న తేడాను చక్కగా వివరించారు. ఆరోగ్యంలో రోగనిరోధక శక్తి గురించి వివరించిన తీరు బావుంది. లాహిరి, లాహిరిలో.... అందించిన నాటి హీరోయిన్ వహీదా రెహమాన్ గురించి తెలుసుకున్నాం. ఈ వారం అతిథి వస్తున్న తీరు బావుంది.

**సునీత, మేడ్చల్.**

## చదవాల్సిన పుస్తకం

కవర్ స్టోరీ, ఆరోగ్యం గురించి వచ్చిన వివరాలు ఆసక్తికరంగా ఉన్నాయి. రాజస్థాన్ రాజరికపు ఆస్థానం లో అక్కడ చూడవలసిన ప్రదేశాలు గురించి వివరంగా ఇచ్చారు. కథ, పుస్తక పరిచయం "ది రిఫ్లెక్షన్ ఆన్ అవర్ టైమ్స్" బావుంది. చదవాల్సిన పుస్తకం ఇది.

**నాగేశ్వరరావు, గాజువాక.**



## పిల్లలపేజీ రంగుల్లో ఇవ్వొచ్చుకదా

కవర్ పేజీ కథనం లో టీవీ గురించి, దానిలో వస్తున్న ప్రసారాల గురించి, అవి నాటి నుండి నేటి వరకు ఎలా వృద్ధి చెందిందీ చక్కగా వివరించారు. రుచిలో ఇస్తున్న వంటకాలు ఇంట్లో చేసుకోడానికి వీలుగా వుంటున్నాయి. విజ్ఞాన వీచికలో జీవ ఇంధనం గురించి ఇచ్చిన వివరాలు చదివి చాలా విషయాలు తెలుసుకున్నాము. ఆరోగ్యంలో వచ్చిన రోగనిరోధక శక్తి గురించి కూడా చాలా విషయాలు తెలిపారు. చూద్దామా.. లో రాజరికపు ఆస్థానం రాజస్థాన్ గురించి, అక్కడ చూడవలసిన ప్రదేశాల గురించి చాలా విషయాలు తెలిపారు. పిల్లలకు సంబంధించిన పేజీలో కలర్ ఫోటోలు వేస్తే బావుంటుంది.

**రాణి,**
**కూకట్‌పల్లి.**




### వీరి వీరి గుమ్మడి పండు వీరి పేరేమి?



ఈ ఫోటో ఓ టాలీవుడ్ హీరోది. జవాబు తెలియాలంటే... పేజీ 21వ పేజీ చూడండి.

డాక్టర్ ఎన్.పాపారావు,
జనరల్ ఫిజిషియన్, హైదరాబాద్.

# ఫ్లూ జ్వరం వస్తే...

స్కూలు పిల్లలు కిక్కిరిసిన గదుల్లో , ఇరుకు గదుల్లో గడపాల్సి వస్తోంది. దాంతో ఎన్నో వైరస్‌లు, బ్యాక్టీరియాలతో ఇంటికి తిరిగొస్తారు. తరచూ జలుబు, ఫ్లూతో బాధపడే అవకాశముంది. ఐదు నుంచి తొమ్మిదేళ్ళ వయస్సులో ఉన్న వారికి ఫ్లూ జ్వరం అధికంగా సోకుతుంది. పిల్లలు అనారోగ్యానికి గురైనప్పుడు కాస్త ఊరట పొందేందుకు ఏదైనా చేసేందుకు తల్లిదండ్రులు సిద్ధంగా ఉంటారు. సాధ్యమైనంత త్వరగా వారు మళ్ళీ సాధారణ స్థితికి చేరుకోవాలని ఆశిస్తారు. పిల్లలు ఫ్లూతో బాధపడుతున్నదీ లేనిదీ ఎలా తెలుసుకోవాలో మీకు తెలుసా....?

**పి**ల్లలకు ఫ్లూ గనుక ఉంటే, అకస్మాత్తుగా అస్వస్థత బారినపడొచ్చు. తీవ్రజ్వరం, వణుకు, బలహీనత, తలనొప్పులు, కీళ్ళు, కండరాల నొప్పులుంటాయి. గొంతు మంట, ఊపిరి పీల్చడంలో ఇబ్బంది ఉంటాయి. పొడి దగ్గు కూడా ఉండే అవకాశం ఉంది. కొంతమందిలో వాంతులు, విరేచనాలు కూడా ఉండొచ్చు. ఏమీ తినబుద్ధి కాదు. ఇతరత్రా సమస్యలేవీ లేకుండా ఈ అనారోగ్యం మూడు నుంచి వారం రోజుల పాటు కొనసాగొచ్చు. కొంతమంది పిల్లల్లో ఇది జ్వరంతో కూడిన సాధారణ గొంతు, ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్‌గా కన్పించవచ్చు.

ఆరోగ్యం బాగా క్షీణిస్తుంటే, ఊపిరి పీల్చుకోవడంలో ఇబ్బంది పడుతుంటే, అన్నిటికీ చికాకు పడుతుంటే, మత్తుగా ఉంటే డాక్టర్‌ను సంప్రదించడం మంచిది. కఫం రంగులో తేడా ఉంటే, ఎద భాగంలో నొప్పి ఉంటే, ఎలాంటి మెరుగుదల లేకుండా 72 గంటలకు పైగా ఇవే లక్షణాలు కొనసాగుతుంటే కూడా డాక్టర్‌కు చూపించడం ఉత్తమం.

పూర్తి విశ్రాంతి అవసరం. సమృద్ధిగా ద్రవపదార్థాలు ఇవ్వాలి. తలనొప్పి, గొంతునొప్పి, ఒంటి నొప్పులకు డాక్టర్ మాత్రమే సూచించిన నొప్పి నివారిణిలను (పెయిన్‌కిల్లర్స్) వాడండి. శరీరం కోల్పోయిన నీటిని తిరిగి భర్తీ చేయడానికి ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్ (ఓఆర్ఎస్) ప్యాకెట్లు వాడడం ఓ మంచి మార్గం. ఉప్పు, చక్కెర, మంచినీళ్ళు లేదా గంజి వాడి ఓఆర్ఎస్‌ను ఇంట్లోనే తయారు చేసుకోవచ్చు. పిల్లలు రోజువారీ పనులు చేసుకోడానికి ముందు వారు సంపూర్ణంగా కోలుకున్నారా లేదా అన్న? అంశాన్ని నిర్ధారించుకోండి.

జలుబు అనేది ఒక్కసారిగా వచ్చేది కాదు. కొద్దిరోజుల పాటు కొద్దికొద్దిగా పెరుగుతూ, కొద్దిపాటి జ్వరంతో వచ్చేది. ఫ్లూతో బాధపడే పిల్లలు జ్వరంతో, నొప్పులతో బాధపడుతుంటారు. ఈ లక్షణాలన్నీ కూడా వేగంగా వృద్ధి చెందుతుంటాయి. జలుబు చేసినప్పుడు బలహీనత, నొప్పులు తక్కువ స్థాయిలోనే ఉంటాయి. ఫ్లూ జ్వరం గనుక వస్తే, ఇవి తీవ్ర స్థాయిలో ఉంటాయి. పడక మీద నుంచి లేవలేరు. జలుబు చేసినప్పుడు ముక్కు కారడం సాధారణమే అయినప్పటికీ, అది పిల్లల్లో ఏమన్నా తినాలన్న కోరికను చంపదు. ఫ్లూ విషయంలో అలా కాదు. ముక్కు కారడం తక్కువగానే ఉన్నా, ఆకలి అంతగా ఉండదు. జలుబు ఉన్నా, ఫ్లూ ఉన్నా పిల్లలు గొంతునొప్పి, దగ్గుతో బాధపడే అవకాశం ఉంది.

ఫ్లూ వ్యాక్సీన్ వేయించడం పిల్లలందరికీ మంచిదే. ప్రత్యేకించి ఆరునెలల పైబడి, రెండేళ్ళ లోపు పిల్లలకు ఇది మంచిది. ఊపిరితిత్తులు, గుండె, కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్న వారికి, ఏవైనా వ్యాధులకు గురై (క్యాన్సర్ లేదా హెచ్ఐవికి గురైనందువల్ల) లేదా చికిత్స (ఓరల్ స్టెరాయిడ్స్ లేదా క్యాన్సర్) పొందుతూ రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న వారికి ఈ టీకాలు మంచివి. పిల్లలకు టీకా ఇప్పించే ముందు డాక్టర్‌ను సంప్రదించండి. గతంలో ఫ్లూ వచ్చినా లేదా ఫ్లూ వ్యాక్సీన్ వేయించుకున్నా ఏడాదికి ఒక్కసారి వేయిస్తే సరిపోతుంది. లేని పక్షంలో మొదటిసారిగా వేయిస్తున్నట్లయితే, తొమ్మిదేళ్ళ లోపు వయస్సు అయితే, 4-6 వారాల మధ్యకాలంలో రెండు డోసులు వేయించాలి. ఇక ఆ తరువాత ఏడాదికి ఒక్కసారి వేయించవచ్చు (ఫ్లూ వ్యాపకశక్తి ఏటా మారుతుంది. అందువల్ల ఏటా వ్యాక్సినేషన్ అవసరమవుతుంది).

చూద్దామా...

యాజీవ్

# ఔరా! అనిపించే ఔరంగాబాద్

**రాచరికపు ఆనవాళ్లు ఇంకా కనిపించే నగరాలలో రాజస్థాన్ మొదటిదైతే, రెండవది ఔరంగాబాద్ అనుకోవచ్చు. అయితే విపరీతమైన వేగంతో పారిశ్రామీకరణ దిశగా పరుగుతీస్తున్న ఈ ప్రాచీన నగరం ఔత్సాహికులకు మంచి విహార స్థలం. పైగా, పేరెన్నికగన్న అజంతా, ఎల్లోరా గుహలున్న ప్రదేశం కూడా!**

ఔరంగాబాద్ నగరాన్ని 1610లో మాలిక్ అంబర్ స్థాపించాడు. అతను రెండవ ముర్తజా నిజాంషా దగ్గర ప్రధానమంత్రిగా ఉండేవాడు. అప్పట్లో దీనిని 'ఖడ్కి' /'ఖిర్కి' అని పిలిచేవాళ్ళు. దక్కన్ ప్రాంతానికి వైస్రాయ్‌గా ఔరంగజేబు ఉన్నప్పుడు ఈ నగరం చూసి, ముచ్చటపడి దీనిని రాజధానిగా మార్చాడు. అప్పటి నుండి ఇది ఔరంగాబాద్ అయింది. ఆ రోజుల్లో ఈ నగరం సంగీత, సాహిత్యాల వంటి కళలకు, సాంప్రదాయాలకు నిలయమై విలసిల్లింది. ఆ రోజుల్లోనే (1672) ఔరంగజేబు కుమారుడు అజయ్‌షా 'బీబీకా మక్బరా' అని తాజ్‌మహల్ రూపంలో తన తల్లి జ్ఞాపకార్థం ఒక అందమైన నిర్మాణాన్ని ఏర్పాటు చేశాడు. దక్కన్ ప్రాంతానికి వైస్రాయ్‌గా ఔరంగజేబు ఉన్నప్పుడు ఈ నగరాన్ని చూసి, ముచ్చటపడి దీనిని రాజధానిగా మార్చాడు. అప్పటి నుండి ఇది ఔరంగాబాద్ అయింది. ఆ రోజుల్లో ఈ నగరం సంగీత, సాహిత్యాల వంటి కళలకు, సాంప్రదాయాలకు నిలయమై విలసిల్లింది.

ఆ రోజుల్లోనే (1672) ఔరంగజేబు కుమారుడు అజయ్‌షా 'బీబీకా మక్బరా' అని తాజ్‌మహల్ రూపంలో తన తల్లి జ్ఞాపకార్థం ఒక అందమైన నిర్మాణాన్ని ఏర్పాటు చేశాడు. అద్భుతమైన మొగల్ నిర్మాణ కౌశలానికి దక్కన్ ప్రాంతంలోని ఆ కట్టడమే నిదర్శనం.

### ద్వారాల నగరం

ఔరంగాబాద్ నగరం మొత్తం పెద్ద ప్రాకారం లోపల ఉంటుంది. నగరంలోకి వెళ్లడానికి అనేక ద్వారాలు కూడా ఉన్నాయి. ఇప్పటికీ కనిపించే ఈ ద్వారాలు ఔరంగాబాద్‌కి ద్వారాల నగరం (సిటీ ఆఫ్ గేట్స్) అనే పేరు సార్థకం చేస్తాయి. మొత్తం 13 రాజసం ఉట్టిపడే ద్వారాలున్నాయి. అయితే అప్పట్లో మొత్తం 54 ద్వారాలుండేవి. ఇప్పుడు మిగిలిన ద్వారాలు అప్పటి రాజసానికి బాధాకర ఆనవాళ్లుగా కనిపిస్తుంటాయి.

### ఆకట్టుకునే అజంతా... ఎల్లోరా

ఔరంగాబాద్‌లో చూడదగ్గ, చూడవలసిన అతి ముఖ్యమైన ప్రదేశాలు అజంతా, ఎల్లోరా గుహలు.







అజంతా గుహలు క్రీస్తు పూర్వం 200 నుండి క్రీ.శ. 650 వరకు బౌద్ధమత వ్యాప్తిలో ఘట్టాలను తెలుపుతాయి. ఈ గుహలు కొన్ని శతాబ్దాల పాటు ఎవరికీ తెలియకుండా మరుగున పడిపోయి ఉండేవి. 19వ శతాబ్దిలో బ్రిటిషర్లు కొందరు పులి వేటకోసం వెళ్లి... అనుకోకుండా వీటిని గుర్తించారు. అప్పటి నుండి ఇవి వెలుగులోకి వచ్చాయి. ఇప్పుడు యునెస్కో వారి హెరిటేజ్ సైట్‌గా సంరక్షించబడుతున్నాయి.

ఇక్కడ ఉండే 29 గుహలను బౌద్ధ సన్యాసులు నిర్మించారని అంటారు. లోపల అద్భుతమైన శిల్పాలు, చిత్రాలు జాతక కథలను వివరిస్తాయి. మొదటి గుహలో ఇప్పటికీ చెదరకుండా నిలిచి ఉన్న కుడ్య చిత్రాలు కనిపిస్తాయి. అలాగే 1,4,17,19,24,26 గుహలలో అద్భుతమైన శిల్పాలు కన్పిస్తాయి.

ఎల్లోరా గుహలు ఔరంగాబాద్ పట్టణానికి దాదాపు 30 కిమీ దూరాన ఉన్నాయి. అజంతా లాగే ఎల్లోరా కూడా యునెస్కో హెరిటేజ్ ప్రదేశమే. ఇక్కడి 34 గుహలు వాస్తవానికి కొండల్లో నుండి తొలిచినవి. చంద్రనాద్రి కొండలలో తొలిచిన ఈ గుహలు ఆ రకం వాస్తు నిర్మాణశైలికి అద్దం పడుతాయి. ఈ గుహలు 5-10 శతాబ్దాల మధ్య నిర్మించి ఉండవచ్చు. వీటిలో 12 బౌద్ధ గుహలు, 17 హిందూ గుహలు, 5 జైను గుహలు ఉన్నాయి. అన్ని ముఖ్య మతాల ఆలయాలు ఒకే దగ్గర ఉండటం అప్పట్లో ఉన్న మత సామరస్యానికి గుర్తు.

ఎల్లోరా మొత్తంలో అత్యద్భుతంగా నిర్మించిన కైలాసనాథ ఆలయం ఏక శిలా చెక్కడం అంటే ఆశ్చర్యం కలగక మానదు. ఒకే శిల నుండి అంతస్తులు అంతస్తులుగా అద్భుతమైన గుడిని తొలుస్తూ, నిర్మించడమంటే మాటలా? కళ్లారా చూస్తేనే గాని దాని అద్భుతం అనుభవం కాదు. బహుశా ఈ నిర్మాణం వందేళ్లపాటు సాగి ఉంటుంది.

అలాగే 15వ ఎల్లోరా గుహలో దశావతారాలు, 21వ గుహలోని రామేశ్వర్ ఆలయం, గంగ, యమునల శిల్పాలు మరింత అద్భుతంగా అనిపిస్తాయి. ఈ గుహల్లో పురాతనమైనవి బౌద్ధ గుహలు. వీటిలో చాలా వరకు విహారాలు. కొండలోకి తొలిచిన రెండు, మూడంతస్తులలో ఉండటానికి, నిద్రపోవడానికి, వంటకి... ఇలా ఎన్నో వసతులుండేవి.

కైలాస ఆలయానికి దాదాపు ఒక మైలు దూరాన జైన గుహలున్నాయి. వీటిలో కూడా అద్భుతమైన శిల్పాలున్నాయి.

**అదృష్టనగరం**

ఔరంగాబాద్‌కి 15 కి.మీ దూరంలో దౌలతాబాద్ అనే పట్టణం ఉంది. అదృష్టనగరం అని పిలువడిన ఈ నగరానికి పాతపేరు దేవగిరి. ఈ పట్టణంలో 12వ శతాబ్దిలో నిర్మించిన అద్భుతమైన కోట ఉంది. దీని చుట్టూ 5 కిమీ మేర ప్రహరీ ఉంది.

**లోనార్**

ఔరంగాబాద్ సమీపంలోనే 'లోనార్' అనే చిన్న ఊరుంది. 50,000 సంవత్సరాల క్రితం భూమ్మీద పడిన ఉల్క ఒక పెద్ద గుంట చేసింది. ఆ ఉల్క చేసిన గుంటే ఈనాడు ఒక చెరువుగా మారింది. ఈ చెరువులో నీళ్లు క్షారంగా ఉంటాయి. వీటిలో ఏ జంతువూ, మొక్కా జీవించలేదు! ❋









తెర

# అవగాహన అవలోకన

రాష్ట్ర సమైక్యత సమస్య నుంచి అణు ఒప్పందం వరకూ ఏ విషయమైనా లోతుగా పరిశీలించి స్పష్టమైన అభిప్రాయానికి రావడం, దాన్ని మరింత స్పష్టంగా ప్రకటించడం సిపిఎంకు మొదటి నుంచి అలవాటు. ప్రజల కోణం నుంచి ఆలోచించే చిత్తశుద్ధి లేని అవకాశవాదంతో ఎప్పటికెయ్యది ప్రస్తుతమో ఆ మాట మాట్లాడుతూ కాలం గడుపుకోవాలనుకుంటారు పాలకవర్గ నేతలు. ఆయా పార్టీల అధిష్టానాలు హైదరాబాదులో వున్నా న్యూఢిల్లీలో వున్నా కీలకమైన సమస్యలపై నిర్ణయాలు దాటేస్తుంటారు. వాలును బట్టి చూద్దామనుకుంటారు. కాని అవసరమైనప్పుడు ఏటికి ఎదురీతలా అనిపిస్తున్నా సరైన వైఖరితో నిలబడి ప్రజలను చైతన్యపర్చాలనుకుంటారు కమ్యూనిస్టులు. ఆ స్ఫూర్తి ఈ వ్యాసాలలో అడుగడుగునా గోచరిస్తుంది.




పరిశీలనా వుంది. తెలుగు దేశంతో సంబంధాలపై ఇప్పుడు అనేక అవాకులు చవాకులు పలికే వారికి ఈ అక్షర తూణీరాలే సమాధానమిస్తాయి. ప్రభుత్వ ప్రతిపక్షాలలో ఎవరు వున్నా కమ్యూనిస్టులు మాత్రం ప్రజల పక్షానే మాట్లాడుతున్నట్టు స్పష్టమవుతుంది.

వేగంగా ప్రవహించే నీళ్లలో నిలిచి ముందు వెనక చూసుకోవడం తేలికైన పని కాదు. ఈతలో నేర్పు, చేతలో ఒడుపు లోపిస్తే ప్రవాహం మనను పట్టి ఈడ్చుకుపోతుంది.

ఇది ఇరవై నాలుగ్గంటల ఛానళ్ల యుగం. ఏ నిమిషం సమాచారం ఆ నిమిషంలోనే అందుతున్న లేదా అందిందనుకుంటున్న స్థితి. రాజకీయ సామాజిక పరిణామాలూ, వాటిపై ప్రతిస్పందనలు క్షణాల మీద వెల్లడవుతున్న దశ. అనుక్షణం అన్నీ అందరికీ తెలిసిపోతున్నట్టు కనిపించే ఈ కాలం మాయాజాలంలో అసలైన విషయాలను అవగాహన చేసుకోవడానికి, అంచనాలకు రావడానికి ఇంతకు ముందుకంటే ఎక్కువ కష్టపడవలసి వస్తుంది. పూర్వాపరాలనూ, పరస్పర సంబంధాలను, వైరుధ్యాలను ఒక క్రమంలో తెలుసుకోవడం తప్ప ఇందుకు మరో మార్గం లేదు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి, నిరంతర ఉద్యమ నిబద్ధుడు బి.వి.రాఘవులు గత అయిదేళ్ల కాలంలో రాసిన వ్యాసాలతో వెలువడిన వ్యాస సంకలనం "ఉద్యమ కోణం" అలాంటి అవగాహననిచ్చే అవలోకనం. సమకాలీన చరిత్రను సాకల్యంగా సాధికారికంగా వ్యాఖ్యానించే సమాచార సంపుటం. గతాన్ని వర్తమానాన్ని కూడా యదేచ్ఛగా వక్రీకరించి నిందారోపణలు సాగించే వారికి ఇందులో చెంపపెట్టులాంటి సమాధానాలున్నాయి. ప్రజా పోరాటాలకు అభినందనలూ, ప్రజా కంటక ప్రభుత్వాలకు అభిశంసనలూ వున్నాయి. వున్న ప్రతిదీ సాధికారికంగా సప్రమాణికంగా వుండటం ఇక్కడ ప్రత్యేకించి గమనించదగింది.

ఏ రోటి దగ్గర ఆ పాట పాడటం, ఏ ఎండకా గొడుగు పట్టడం పాలక పార్టీలకు బాగా అలవాటు. ప్రజలను చైతన్య పర్చడం కంటే మభ్యపెట్టి పబ్బం గడుపుకోవడమే వారికి ముఖ్యం. కాని కమ్యూనిస్టుల పద్ధతి ఇందుకు పూర్తి భిన్నం. వ్యధార్థ జీవిత యధార్థ దృశ్యాలను, పాలకులు మరుగు పరచే పరమ సత్యాలనూ విశాల జనబాహుళ్యానికి విప్పిచెప్పి సమరోన్ముఖులను చేయడం వారి విధానం. ఈ సంకలనంలోని వ్యాసాలలో పరిశీలించిన సమస్యలు, రాసిన సందర్భాలు భిన్నమైనవైనా వాటిలోని ఏకసూత్రతనూ, త్రికరణశుద్ధిని, నిశిత పరిశీలనను పాఠకులు తప్పక హర్షిస్తారు.

2004లో తెలుగు దేశం పాలన చివరి దశ నుంచి రాసిన వ్యాసాలు ఇందులో వున్నాయి. అప్పటి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అనుసరించిన ప్రపంచ బ్యాంకు విధానాల విష ఫలితాలపై నిశితమైన విమర్శలున్నాయి. దానిపై ఉవ్వెత్తున సాగిన ఉద్యమాల అనుభవాలున్నాయి. వీటన్నిటి ఫలితంగా ఎన్నికల్లో ఆ ప్రభుత్వం ఘోర పరాజయానికి దారి తీసిన పరిస్థితుల

రాష్ట్రంలో వైఎస్ రాజశేఖరరెడ్డి అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత అంచలంచెలుగా పరిస్థితి దిగజారడాన్ని మనం ఈ సంకలనంలో తెలుసుకోగలుగుతాము. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదటి వందరోజులు పూర్తయిన సందర్భంలో రచయిత దాని తొలి చర్యలు సానుకూల దిశలో వుండటాన్ని అభినందించారు. అయితే 'పెరగంగ తెలిసింది పెద్దయ్య బుద్ధి' చందంగా అతి స్వల్ప కాలంలోనే అధ్వాన పరిస్థితి తెచ్చిపెట్టిన కాంగ్రెస్ నేతల నిర్వాకాల క్రమానుగత విశ్లేషణ చూస్తాం. ప్రజా వ్యతిరేక విధానాలు తగవని మొదటి నుంచి హెచ్చరిస్తున్నా నిర్లక్ష్యంగా, నిర్లజ్జగా, నీతి బాహ్య విధానాలనే కొనసాగించిన వైపరీత్యాలు గమనిస్తాం. అవినీతి ఆరోపణలపై ఉడుక్కొని ఆయనపై కేసులు పెట్టిన ప్రభుత్వం తర్వాత దాన్ని ఉపసంహరించుకోక తప్పలేదు. క్రమంగా పెరిగిపోయిన కుంభకోణ పురాణాలు రాఘవులు విమర్శలలోని వాస్తవాన్ని ప్రజలకు మరింత బాగా ఎరుకపర్చాయి. విద్యుచ్ఛక్తి పోరాటం గత ప్రభుత్వ పరాజయానికి ఆఖరి ఘట్టాన్ని రచిస్తే భూ పోరాటాలు ఈ ప్రభుత్వాన్ని దడదడ లాడించాయి. సామదాన భేద దండోపాయాలు విఫలమైన తర్వాత ముదిగొండ నరమేధం దేశాన్నే కదిలించింది. ఇప్పుడు మళ్లీ మలి దశ పోరాటానికి రంగం సిద్ధమవుతున్నది.

పోరాటాలపై భౌతికంగా దాడులు చేయడమే కాక నైతికంగా కూడా దాన్ని దెబ్బ

తీయాలని చూడటం పాలకవర్గాలకు పరిపాటి. మన రాష్ట్రంలో యాభయ్యవ దశకంలో కమ్యూనిస్టుపార్టీపైన, నాయకులపైన వారు నీచాతినీచమైన నిందారోపణలు సాగించారు. దాదాపు యాభై ఏళ్ల తర్వాత మరోసారి ఈ కాలంలో కాంగ్రెస్ నేతలు అలాంటి అసహ్యకరమైన అబద్ధాలనే ప్రచారంలో పెట్టారు. ప్రజల కోసం పోరాడుతున్న సిపిఎం నాయకులపై కులం, ప్రాంతం వగైరా ముద్రలు వేసేందుకు విఫలయత్నం చేశారు. నిగ్గుతేలిన సిపిఎం రాజకీయపంథాపై నిందారోపణలకూ అపహాస్యాలకూ పాల్పడ్డారు. మీడియాలో కూడా ఒక భాగం ఇందుకు వంతపాడింది. ఇలాంటి సంక్లిష్ట పరిస్థితుల్లో సవాళ్లను ఎదుర్కొంటూ ఉద్యమాలు సాగించడం ఒక ఎత్తయితే ఆ దుష్ప్రచారాలను సత్యాలతో దునుమాడడం మరో ఎత్తు. ఈ ప్రయత్నం ఈ సంకలనంలో అడుగడుగునా మనకు కన్పిస్తుంది.

ఈ సంకలనంలోని వ్యాసాలు చదివితే బి.వి.రాఘవులు పరిశీలన, పఠనాల విస్తృతి తెలుస్తుంది. ప్రత్యక్షంగా రంగంలో వుండి పోరాడుతూ నిరాహారదీక్షల వంటివి చేస్తూ కూడా ఆయన ఇవన్నీ రాయడం అభినందనీయం. ప్రజాశక్తిలో దాదాపు ప్రతి వారం ఆయన వ్యాసం వస్తుండేది. కొంతకాలం పాటు వార్తలోనూ, ఆంధ్రప్రభలోనూ కూడా క్రమబద్ధంగా రాశారు. ఇవేగాక అన్ని ఛానళ్లలోనూ ముక్కుసూటిగా తన అభిప్రాయాలు చెబుతూనే వుంటారు. ఈ రచనలు, మీడియా కృషి కూడా వర్గపోరాటంలో భాగం గనకే ఇంతగా శ్రమ పడటం. రంగంలో ముందు నిలిచే రాజకీయ నేతలు తమ భావాలను నేరుగా అక్షర రూపంలో ప్రజలతో పంచుకోవడం ప్రజాస్వామ్య ప్రక్రియలో చాలా అవసరం.

రాఘవులు క్రియాశీల నాయకుడు గనక ప్రజలతో ప్రజల పోరాటాలతో నిత్యసంబంధం వుంటుంది. ప్రజల చైతన్యాన్ని, సమరశీలతనూ గమనించగల అవకాశమూ వుంటుంది. అదే సమయంలో వారిని బాధపెట్టే సమస్యల గురించిన ప్రత్యక్ష అనుభవమూ వుంటుంది. ప్రజల మనోభావాలెలా వున్నదీ తెలుసుకోవడానికి ఉద్యమాలూ ప్రజా సంఘాలతో సంబంధాలు ఎంతగానో ఉపయోగపడతాయి. రాష్ట్ర సమైక్యత సమస్య నుంచి అణు ఒప్పందం వరకూ ఏ విషయమైనా లోతుగా పరిశీలించి స్పష్టమైన అభిప్రాయానికి రావడం, దాన్ని మరింత స్పష్టంగా ప్రకటించడం సిపిఎంకు మొదటి నుంచి అలవాటు. ప్రజల కోణం నుంచి ఆలోచించే చిత్తశుద్ధి లేని అవకాశవాదంతో 'ఎప్పటికెయ్యది ప్రస్తుతమో' ఆ మాట మాట్లాడుతూ కాలం గడుపుకోవాలనుకుంటారు పాలకవర్గ నేతలు. ఆయా పార్టీల అధిష్టానాలు హైదరాబాదులో వున్నా న్యూఢిల్లీలో వున్నా కీలకమైన సమస్యలపై నిర్ణయాలు దాటేస్తుంటారు. వాలును బట్టి చూద్దామనుకుంటారు. కాని అవసరమైనప్పుడు ఏటికి ఎదురీతలా అన్పిస్తున్నా సరైన వైఖరితో నిలబడి ప్రజలను చైతన్యపర్చాలనుకుంటారు కమ్యూనిస్టులు. ఆ స్ఫూర్తి ఈ వ్యాసాలలో అడుగడుగునా గోచరిస్తుంది.

అందుకే ఈ పుస్తకం ఏక కాలంలో సమీప గతాన్ని సింహావలోకనం చేసుకోవడానికి, వర్తమానంలో కర్తవ్యాలు నిర్వర్తించడానికి, సమీప భవిష్యత్తుకు సమాయత్తం కావడానికి సహాయకారి అవుతుంది. ఎవరి అభిప్రాయాలు ఏవైనా విషయ పరిజ్ఞానానికి సమస్యల విశ్లేషణకూ మార్గదర్శకమవుతుంది. 2004 ఎన్నికలకు ముందు ప్రకటించిన 'ప్రపంచ బ్యాంకు ఫర్మానాలు- ప్రజా కంటక విధానాలు' అన్న రాఘవులు వ్యాస సంకలనం అప్పట్లో మంచి సమాచార వనరుగా దోహదపడింది. వెంట వెంటనే ఒకటికి రెండు ముద్రణలు పొందింది. దాంతో పాటే మరికొన్ని రాజకీయ ప్రచురణలు కూడా వెలువడ్డాయి. కాంగ్రెస్ నాయకులు ఆ పుస్తకాల ప్రతులు ఇప్పుడు టోకున పంచితే తెలుగుదేశంపై దాడికి ఉపయోగపడుతుందని ఆశపడుతుంటారు. ఆ కొరత తీర్చేందుకోసం పాత ప్రభుత్వంపై వచ్చిన పుస్తకాన్ని పట్టుకువేళ్లాడే శ్రమ లేకుండా వారి పాలనలో నిర్వాకాల నిజరూపాన్నే తెలియజేసే సరికొత్త పుస్తకం పాఠకులకు అందించవచ్చు. కావాలంటే కాంగ్రెస్ నాయకులు దీన్ని ఎన్ని వేల ప్రతులైనా తీసుకుని చదివి విధానాలు మార్చుకుంటే ప్రజలు సంతోషిస్తారు. విధానాలు మార్చుకోకుండా ఆత్మస్తుతి పరనిందలలో మునిగిపోతే ఆ ప్రజలే తగు పాఠమూ చెబుతారు.

**ఉద్యమ కోణం**

**బి.వి. రాఘవులు**

**వెల: 80**

**పేజీలు: 300**

**ప్రతులకు: ప్రజాశక్తి బుక్ హౌస్**

**1-1-187/1/2/, చిక్కడపల్లి,**

**హైదరాబాద్.**

❋






సీరియల్

మూలం : బరీ మై హార్ట్ ఎట్ ఊండెడ్ నీ (డీ బ్రౌన్)

తెలుగు సేత: ముక్తవరం పార్థసారథి

**జరిగినకథ:**

**యూట్స్ ప్రాంతం, అమెరికాలోనే అత్యంత సారవంతమైన నేల. అక్కడి పచ్చటి మైదానాలు, సమృద్ధిగా వున్న పశు సంపద, వివిధ ఫల జాతులు, అనేక రకాల దుంపలు, గింజలు ఎంత జనాభాకైనా చిరకాలం ఆహారం అందించగలవు. ప్రకృతి ప్రసాదించిన స్వర్గమిది. లాస్‌ప్నైనోస్, వైట్ రివర్‌ల (వద్ద ఆఫీసు లేర్పరుచుకున్న) ఏజెంట్ల దయాధర్మాల మీద ఆధార పడవలసిన అవసరం లేదు. వాళ్ల రేషన్ల అవసరం లేదు. 1875లో, లాస్ పైనెస్ ఏజెంట్ ఎఫ్.ఎఫ్. బాండ్ యూట్‌ల జనాభా సేకరణ జరపాలన్న సలహాకిలా స్పందించాడు.**

జనరల్ క్రూక్

# అమెరికన్ దేగ

**(61వ భాగం)**

**1878** వసంత కాలంలో వాళ్ళ స్వేచ్ఛ అంతరించింది. నాథన్ సి. మీకర్ అనబడే కొత్త ఏజెంట్ వైట్ రివర్ వద్ద బాధ్యతలు స్వీకరించాడు. అతడు కవి, పత్రికా విలేకరి, సహకార వ్యవసాయాన్ని ప్రోత్సహించిన "సంస్కర్త". ఆర్థిక ఇబ్బందుల్లో ఉండి, ధనార్జన కోసమే "ఏజెంట్‌గా ఉద్యోగంలో చేరాడు" యూట్‌లు అనాగరికులు, ఆటవికులు. వాళ్ళను సంస్కరించి నాగరికులుగా చేయవలసిన బాధ్యత తెల్లజాతి మీదే వుందని గాఢంగా నమ్మి తన కార్యక్రమాలు ప్రారంభించాడు. "ఆటవిక దశనుండి వ్యవసాయ దశకు అటు నుండి శాస్త్రీయ జ్ఞానాన్ని బోధించి, వాళ్ళకు (క్రైస్తవ) మతంలో విశ్వాసాన్ని పెంపొందించటం" తన లక్ష్యమని గర్వంగా చెప్పుకొన్నాడు. "ఐదు, పది, లేదా ఇరవయ్యేళ్ళు పట్టినా సరే సాధించి తీరుతాను".

త్వరలోనే అతని అహంకారం, మూర్ఖత్వం యూట్ తెగనే నాశనం చేసింది. వాళ్ల ఆహార వ్యవహారాలు 'సంస్కృతి' అతని దృష్టిలో "పాశవిక అవశేషాలు! మాత్రమే. ఈ ఆదిమానవులను ఉద్ధరించటానికే భగవంతుడు అతనినిక్కడికి పంపించాడా! మొదటగా ఏజెన్సీని, వైట్ రివర్ నుండి పదిహేను మైళ్ల దూరంగా తరలించారు. అది పంటలు పండించటానికి అనువైన స్థలం అని అతడు నిర్ణయించాడు. అక్కడ సహకార వ్యవసాయం చెయ్యటానికి ఓ కాలనీ ఏర్పాటు చేశాడు. ఉద్దేశం మంచిదే కావచ్చు. కానీ, అప్పటికే ఆప్రాంతాన్ని వాళ్లు వేటకోసం వాడుకుంటున్నారని అతడు గ్రహించలేదు. గుర్రాలు గడ్డి మేయటానికి కూడా అక్కడికే వస్తాయి. గుర్రప్పందాలు యూట్‌ల ప్రధాన వినోదం. (గుర్రాల) రేసింగ్ ట్రాక్ కూడా అక్కడే ఉంది.

వైట్ రివర్ వద్ద ఒక యూట్ నాయకుడు క్వింకెట్ (డగ్లస్)తో మీకర్‌కు కొంత సాన్నిహిత్యమేర్పడింది. డగ్లస్‌ది యాంపాయూట్‌తెగ. వయస్సు అరవై దాటింది. జుత్తూ, మీసాలూ నెరిసినా ఇంకా దృఢంగానే ఉన్నాడు. సుమారు వంద గుర్రాలకు యజమాని. ఇతర యూట్‌లతో పోలిస్తే సంపన్నుడన్నమాటే. అయినా, నికాగట్ (జాక్) కున్నంత పలుకుబడిలేదు.

ఊరే లాగ జాక్ గూడా అపాచీ-యూట్ తెగల మిశ్రమ సంతానం. బాల్యంలో, ఒక మార్మాన్ (క్రైస్తవుల్లో ఒక శాఖ) కుటుంబంతో వున్న సంబంధం వల్ల కొంత ఇంగ్లీష్ అబ్బింది. సియో యుద్ధాల కాలంలో, జనరల్ క్రూక్ వద్ద స్కౌట్‌గా పనిచేశాడు. మీకర్‌ను కలిసినప్పుడతడు స్కౌట్ యూనిఫాం- జింక తోళ్ల దుస్తులు (బక్‌స్కిన్) లోనే వున్నాడు, సైనికుల బూట్లు, హ్యాట్‌లో అమెరికన్‌లాగే కనిపించాడు. 1868లో ఊరేతో కలిసి వాషింగ్టన్ వెళ్లినప్పుడు, గ్రేట్ ఫాదర్ అతడికో మెడల్ బహూకరించాడు. ఓ ఆభరణంలాగ, దాన్నెప్పుడూ ఛాతీమీద తగిలించుకున్నాడు.

మీకర్ ఆదేశాల ప్రకారం, ఏజెన్సీ పదిహేనుమైళ్లు తరలినప్పుడు అతను దున్నల వేటకోసం అడవుల్లో ఉన్నాడు. తిరిగివచ్చి, ఏజెన్సీ పాత చోట లేకపోవడం చూసి, అక్కడే క్యాంపు వేసుకుని విశ్రాంతి తీసుకున్నాడు. కానీ రెండు రోజుల్లోనే మీకర్ వచ్చి, కొత్త చోటికి కదలక తప్పదన్నాడు.

"ఒప్పందం ప్రకారం ఇక్కడే కదా ఏజెన్సీ ఉండాలి" అని మీకర్‌ను అడిగాడు, కానీ అతడు కటువుగా, తన ఆదేశాలు పాటించకపోతే సైనికులు వచ్చి బలవంతంగా తరలిస్తారు. అంటూ బెదిరించాడు" అని తరువాతి రోజుల్లో తన స్టేట్‌మెంట్ రికార్డు చేశాడు జాక్. ఆ తర్వాత, పాడిగేదెలను సంపాదించుకోవాలి, కొన్నాళ్లాగమని మీకర్‌ను అర్థించాడు. కానీ "ఇండియన్లకు పాలతో ఏం పని?" అంటూ కసురుకున్నాడు ఏజెంట్.

యూట్‌లలో మరో ముఖ్య నాయకుడు 'కలరో'. ఇతనిది మాచీ తెగ. వృద్ధుడు. అరవై దాటాయి. 1868 ఒప్పందం తర్వాత, అనుచరులతోపాటు, డెన్వర్ సమీపంలోని తాత్కాలిక రిజర్వేషన్‌లలో గడిపి అధికారులతో సఖ్యత పెంచుకున్నాడు. అక్కడున్న కాలంలో , అప్పుడప్పుడూ నగరంలోకి వెళ్లి అక్కడి హోటళ్ళలో విందారగించి (నాటకశాలల్లో) వినోద ప్రదర్శనల్లో కూడా పాల్గొన్నాడు (తెల్లవాళ్ళను అనుకరించి ప్రేక్షకులను నవ్వించటం ఇతని ప్రత్యేకత). 1875లో రిజర్వేషన్‌ను మూసేసినప్పుడు, తన తెగవాళ్లతో వైట్ రివర్‌కెళ్లి జాక్ బృందంలో కలిశాడు. ఇక్కడ, డెన్వర్‌లో ఉన్న ఆనందం లేదుకానీ వేటకు వెళ్లి బాగానే భోజనం సంపాదించుకున్నారు. మీకర్ ప్రవేశపెట్టిన వ్యవసాయక పద్ధతులు మాచీలకు నచ్చలేదు. ఆ క్రమశిక్షణ వారి స్వభావంలోనే లేదు. అవసరమైనప్పుడు అధికారులనడిగి కొన్ని బస్తాల పిండి, కాఫీ, చక్కెర తెచ్చుకోవడం తప్ప రిజర్వేషన్ నిబంధనలు కూడా వాళ్లకు తెలియవు.

కనాలా (జాన్సన్) అక్కడి ప్రధాన మాంత్రికుడు. ఇతడు ఊరే బావమరిది. గుర్రాల రేసింగ్ ట్రాక్‌కు కూడా నిర్వహిస్తాడు (మీకర్, ఏజెన్సీ కోసం భవనాలు కట్టిస్తానన్నదిక్కడే). అమెరికన్ జీవన విధానానికి కొంత దగ్గరగా వచ్చిన ఇతడు తనకు సహాయం చేస్తే 'యూట్'కు నాగరికత నేర్పించవచ్చనుకున్నాడు మీకర్.

ఒక మహత్తరమైన సంస్కరణోద్యమాన్ని ప్రారంభించబోతున్నానని అతని అభిప్రాయం. భార్య అర్వీలా, కూతురు జోసేని కూడా ఇందులో పాలుపంచుకోమన్నాడు. ఒక సర్వేయర్‌తో సహా ఏడుగురు తెల్లవాళ్లు ఒక

సాగునీటి కాలువ తీయటానికి ప్లాన్లు గీశారు. బిల్డింగులు, బ్రిడ్జిలు కట్టటానికి అవసరమైన సిబ్బందీ, వడ్రంగివాళ్లు వచ్చారు. అందరూ కలిసి యూట్‌లకు ఆధునిక జీవన విధానం అంటే ఏమిటో రుచి చూపించాలి.

వాళ్లను ఉద్ధరించటానికే వచ్చాడు గనక, ఈ "ఆటవికులు" తనను "ఫాదర్ మీకర్" అని పిలవాలని ఆయన కోరిక. కానీ యూట్‌లతనికి పెట్టిన పేరు "నిక్". ఇలాంటి అవమానాలకు "సంస్కర్త" మనసు ఎంత గాయపడుతుందో ఎవరైనా వూహించుకోవచ్చు!

1879 వరకు భవనాల నిర్మాణం ఇంచుమించు ముగిసింది. నలభై ఎకరాల భూమి సాగులోనికి వచ్చింది. అయితే ఈ కార్య సాధనలో ఎక్కువగా కృషిచేసింది తెల్లకార్మికులే. వాళ్లకెలాగూ రోజు కూలీ ముట్టింది. సహజంగానే, పనిచేసిన యూట్‌లు కూడా డబ్బులడిగారు. "సొంతపనులు చేసుకోటానికి 'కూలీ' అడుగుతారా ఎవరైనా?" సంస్కర్తకు ఈ ఆటవికుల మనస్తత్వం అర్థం కాలేదు. ఇది సహకారోద్యమం. చివరికి, వాళ్ల పోరు పడలేక, కాలవపనులకుగానూ మప్ఫైమంది యూట్‌లకు ఎంతో కొంత ఇస్తానన్నాడు. కొన్నాళ్లు 'సహకారం' బాగానే కొనసాగింది. కానీ మీకర్ జేబులు ఖాళీ కావటంతో వాళ్లు తిరిగి వేటకోసం వెళ్లిపోయారు. "వాళ్ల అవసరాలు చాలా తక్కువ. 'నాగరికత' పట్ల 'ఆసక్తి' లేకపోవటానికి అదే ప్రధాన కారణం" అని కమిషనర్ ఆఫ్ ఇండియన్ అఫైయిర్స్‌కు తెలియచేశాడు మీకర్. "మనం సౌకర్యాలు, సదుపాయాలు అనే వాటితో వాళ్లకవసరం కలుగదు. కనీసశ్రమతో పొట్ట నింపుకోగలిగి, 'టెపీ'లలో నిద్రించగలిగిన మనుషులకు నాగరికతతో పని వుండదు" పైగా చాలా మంది ఇండియన్లకు, తెల్లవాళ్లంటే చులకన, తృణీకారం. తమ ఆచారవ్యవహారాలే వుత్కృష్టమైనవనుకుంటారు. అందువల్ల వాళ్ల జీవన విధానాన్ని మార్చటానికి, మీకర్ కొత్త ప్రతిపాదన ఒకటి చేశాడు. "స్వేచ్ఛగా తిరిగి వేటాడుతూ కాలయాపన చేయకుండా, వాళ్ల గుర్రాలకు స్వాధీనం చేసుకోవాలి (పొలం పనులకు మాత్రమే ఇక మీదట వాటిని వాడాలి) ఆ తర్వాత, వ్యవసాయ పనులు చేసేవాళ్లకు మాత్రమే రేషన్లు విడుదల చేయాలి. అప్పుడు, ఆకలి కోసమైనా చచ్చినట్టు పొలాలు దున్నుతారు. "భోజనం లేక మరణించినా సరే, నేను నా పద్ధతి మార్చుకోను" అంటూ కొలరాడో సెనేటర్ హెన్రీ ఎం.టెల్లర్‌కు లేఖ రాశాడు మీకర్.

తన వూహలన్నీ తక్షణమే కాగితం మీద పెట్టి, అచ్చులో చూసుకోవటం మీకర్ బలహీనత. ఇదే అతణ్ణి యూట్‌లకు దూరం చేసింది. "శ్రమలోని ఆనందం, వినియోగ వస్తువుల వల్ల కలిగే సౌకర్యాలను ఇండియన్లెప్పుడూ అర్థం చేసుకోలేరని" ఇద్దరు యూట్ స్త్రీలతో జరిపిన ఒక 'కల్పిత' సంభాషణను 1879లో ప్రచురించాడు మీకర్. అంతా ఊహాజనితమే కనుక , రిజర్వేషన్ ప్రాంతం ప్రభుత్వానికి చెందుతుందని, యూట్‌లకు దాన్ని అనుభవించే హక్కు మాత్రమే ఉందని ఆ సంభాషణలో పేర్కొన్నాడు. "అందువల్ల మీరు శ్రమించి సాగు చెయ్యకపోతే తెల్లవాళ్లు ఈ భూమిని కూడా మీనుండి లాక్కుంటారు" సంభాషణ క్రమంలో స్త్రీలకు అతడు చేసిన హెచ్చరిక అది.

యూట్‌లను అదుపులో పెట్టడానికి అన్ని చర్యలు తీసుకుంటామని గవర్నర్‌కు సందేశం పంపుతూ, రిజర్వేషన్ నిర్వహణలో మీకర్ అసమర్థతను ఎత్తిచూపుతూ మరో శ్రీముఖం కూడా జారీ చేసింది ప్రభుత్వం. మీకర్ హడావిడిగా ఇండియన్ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశాడు. ఐతే ఇప్పటికే వాళ్ళు గవర్నర్ మీదా, మీకర్‌మీదా కోపంతో రగిలిపోతున్నారు. డెన్వర్ వార్తాపత్రికలు చదివే ఒక తెల్లజాతి మిత్రుడు, పెక్, నికాగట్ (జాక్) కు తాజావార్తలు చేరవేస్తూనే ఉన్నాడు.

గ్రేలీ (కొలరాడో) ట్రిబ్యూన్‌లో ప్రచురితమైనప్పుడు డెన్వర్‌లో ఉన్న ఒక ఎడిటర్-పొలిటీషియన్ విలియం బి. వికర్స్ ఈ రచనను చదివాడు. అతనికి ఇండియన్లు, మరీ ప్రత్యేకంగా యూట్‌లంటే అసహ్యం. అప్పటికి వికర్స్, ఒక ధనిక మైనర్ ఫ్రెడెరిక్ పిట్కిన్ వద్ద సెక్రటరీగా ఉన్నాడు. (1876 లో కొలరాడో రాష్ట్రంగా ఏర్పడ్డప్పుడు పిట్కిన్ దాని గవర్నరయ్యాడు. అంతకు మూడు సంవత్సరాల క్రితం 1873లో ఇతడే సాన్ యువాన్ పర్వతాలను యూట్‌లనుండి స్వాధీనం చేసుకున్నాడు). 1877 లో సియో యుద్ధాల తర్వాత పిట్కిన్, వికర్స్ కలిసి యూట్‌లను ఇండియన్ టెరిటరీ కే పరిమితం చెయ్యాలని అధికారుల మధ్య ప్రచారం చేశారు. యూట్‌లను వెళ్లగొట్టగలిగితే, ఖనిజ సంపన్నమైన భూమి తమకే దక్కుతుంది. ఇలా వ్యూహం రచిస్తున్న వికర్‌కు పత్రికలో అచ్చయిన మీకర్ వ్యాసం చాలా నచ్చింది. వెంటనే తను కూడా డెన్వర్ ట్రిబ్యూన్‌లో మరో వ్యాసం రాశాడు

"యూట్‌లు నిజమైన (ఆదిమ) కమ్యూనిస్టులు (రచయిత ఉద్దేశంలో కమ్యూనిస్టులంటే 'సామూహిక జీవితం' గడిపేవారని అర్థం) ఉచితంగా తిండి పెట్టి ప్రభుత్వం వాళ్లను సోమరులుగా మారుస్తున్నది. కొద్దిమంది వేటకోసం ఇంత విశాలమైన మైదానాలను వాళ్ల ప్రాంతంగా అంగీకరించిన ఇండియన్ బ్యూరోది మూర్ఖ నిర్ణయమనటంలో సందేహంలేదు. వాళ్లను స్వేచ్ఛగా సంచరించనివ్వటానికి ప్రభుత్వం పెడుతున్న ఖర్చులో సగానికి, "ఇండియన్ టెరిటరీ" లో ఉంచి పోషించవచ్చు.

ఒకప్పుడు గౌరవనీయులైన మీకర్ కూడా ఇండియన్ల పట్ల గొప్ప సానుభూతిని ప్రదర్శించాడు. అతడెంత ప్రయత్నించినా వాళ్లు తమ పద్ధతులు మార్చుకోలేదు. చివరికి, అంతటి సత్పురుషుడు కూడా "ఓన్లీ గుడ్ ఇండియన్ ఈజ్ ఎ డెడ్ ఇండియన్" అనే అభిప్రాయనికి రాక తప్పలేదు."

ఇదే ధోరణిలో వికర్స్ చాలా వ్యాసాలు ప్రచురించాడు. అవన్నీ "యూట్స్ మస్ట్ గో" శీర్షిక కింద కొలరాడో పత్రికల్లో అచ్చయ్యాయి. 1879నాటి, తెల్లవాళ్ల ఉపన్యాస వేదికలన్నీ, వక్తల "యూట్స్ మస్ట్ గో" నినాదంతో ప్రతిధ్వనించాయి.

అలా, ఆనోటా ఈనోటా పత్రికలలో తమ గురించి ప్రచురితమైందంటూ యూట్‌లకు తెలిసింది. అసలు ద్రోహి 'నిక్ మీకర్' అనే అభిప్రాయం కూడా అందర్లో బలపడింది. రిజర్వేషన్ భూమి మీద తమది కాదని ప్రచారం చేస్తాడా! ఏజెన్సీలో ఉన్న దుబాసీ ద్వారా తమ నిరసనలు మీకర్‌కు తెలియజేశారు. ఆపరిస్థితుల్లో బహుశా గత్యంతరం లేక మీకర్ తన వాదనను సమర్థించుకున్నాడు. ముమ్మాటికీ భూమి ప్రభుత్వానిదే. తను ప్రభుత్వ ప్రతినిధిగా దాన్ని దున్నిస్తాడు.

మరో వైపు వికర్స్ 'యూట్స్ మస్ట్ గో" ప్రచారం ఊపందుకుంది. ఇండియన్లందరూ నేరస్తులూ, దుర్మార్గులూ అని చిలువలుపలువలుగా పుకార్లు వ్యాపించాయి. అప్పుడప్పుడూ గాలితో ప్రారంభమైన అడవి మంటలకు కూడా 'యూట్'లదే బాధ్యత అని వాళ్లను నిందించారు. జులై 5 నాడు కమిషనర్ ఆఫ్ ఇండియన్ అఫెయిర్స్‌కు పంపటానికి వికర్స్ ఓ టెలిగ్రాం తయారు చేశాడు.

"వైట్ రివర్ యూట్‌లు రిజర్వేషన్ వదిలి, వేట నెపంతో అరణ్యాలను ధ్వంసం చేస్తున్నట్టుగా నాకు ఉత్తరాలు చేరుతున్నాయి. ఇప్పటికే కొన్ని మిలియన్ డాలర్ల విలువైన కలప తగలబడిపోయిందట. ఈ ఆటవికులు సెట్లర్లనూ, మైనర్లనూ భయపెట్టి వైట్ రివర్ వద్ద తిరగనివ్వటంలేదు.!. కొలరాడోలో కలపవనరులు క్షేమంగా ఉండాలంటే వీళ్లను ఇండియన్ టెరిటరీకి తక్షణమే తరలించక తప్పదు."

యూట్‌లను అదుపులో పెట్టడానికి అన్ని చర్యలు తీసుకుంటామని గవర్నర్‌కు సందేశం పంపుతూ, రిజర్వేషన్ నిర్వహణలో మీకర్ అసమర్థతను ఎత్తిచూపుతూ మరో శ్రీముఖం కూడా జారీ చేసింది ప్రభుత్వం. మీకర్ హడావిడిగా ఇండియన్ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశాడు. ఐతే ఇప్పటికే వాళ్ళు గవర్నర్ మీదా, మీకర్‌మీదా కోపంతో రగిలిపోతున్నారు. డెన్వర్ వార్తాపత్రికలు చదివే ఒక తెల్లజాతి మిత్రుడు, పెక్, నికాగట్ (జాక్) కు తాజావార్తలు చేరవేస్తూనే ఉన్నాడు.

ఒక వార్తా కథనం ప్రకారం, బేర్ రివర్ వద్ద, యూట్‌లు అనేక మంది ఆస్తుల్ని తగలపెట్టారు. అందులో ప్రధానంగా, ఒక మాజీ యూట్ ఏజెంట్ జేమ్స్ బి. థాంప్సన్ ఇంటిని కాల్చేశారు. ఇది తెలిసిన జాక్ కలత చెందాడు కానీ, ఆ వార్త అబద్ధమని గవర్నర్‌కు స్వయంగా నిరూపించవచ్చునన్నాడు పెక్. ఇద్దరూ కలసి థాంప్సన్ ఇంటికెళ్ళారు. అదక్కడ సురక్షితంగానే ఉంది.

**ఇంకా వుంది....**

చందు



# జీవితంలో రెండేసార్లు ఏడ్చాను

నాన్నగారికి ఆరోగ్యం దెబ్బతినడం... హాస్పిటల్ చుట్టూ తిరగడం... ఆర్థిక పరిస్థితులు ప్రతికూలంగా మారాయి. విదేశాల్లో చదివించడం తన వల్ల కాదని నాన్నగారు చెప్పేశారు. పరిస్థితులు ఫొటోగ్రఫీ మీద ఇంట్రస్ట్ పోయేలా చేశాయి. ఇంతలో నాన్నగారు చనిపోయారు. జీవితంలో రెండే రెండుసార్లు ఏడ్చాను. ఒకటి ఫొటోగ్రఫీ కోర్సు అమెరికాలో చేయలేకపోయినప్పుడు, రెండు నాన్నగారు పోయినప్పుడు. ఆపై దృష్టి షేర్ మార్కెట్ వైపు మళ్ళింది. అక్కడా ప్రాబ్లమ్స్ తప్పలేదు. పోనీ బిజినెస్ చేద్దామా? అనుకుంటే అందులో ఓనమాలు కూడా తెలీవు.

నటుడు 'రావు రమేష్' చెప్తోన్న కబుర్లు...

'ముత్యాలముగ్గు'లో బాపుగారు చేసిన అద్భుతమైన ఫీట్ ఏంటంటే... ప్రకృతిని ఎంజాయ్ చేసే విలన్‌ని చూపించారు. చొక్కా పంచె... నోట్లో సిగరెట్... నీట్‌గా షేవ్ చేసుకున్న ఫేస్. 'ఆకాశంలో ఏదో మర్డర్ జరిగినట్టు లేదు... సూర్యుడు నెత్తురు గడ్డలా లేదు...' అంటూ ప్రకృతిని ఎంజాయ్ చేస్తున్న విలన్‌ని చూపిస్తూనే... అతనిలోని కర్కశత్వాన్ని ప్రతిబింబించారు. పొట్టలో కత్తి పొడిచి కట.. కట.. కట.. అని తిప్పేస్తూ బీభత్సంగా చూపించే విలన్ ఎంట్రీ... విలనంటే సహజంగా కనిపించే ఇంతింత మీసాలు... కత్తిగాట్లు... మచ్చలు... డెన్...లు లేకుండా చూపించారు. తెలుగు తెరపై ఇదొక గొప్ప ఫిట్. తమిళంలో ఎం.ఆర్ రాధా (రాధిక తండ్రి)కూ, నాన్నగారికి కొన్ని పోలికలున్నాయి. రోడ్లపై తరిమి తరిమి కొట్టడం... నడి రోడ్డుపై నిండు చూలాలిని కాలితో తన్నడం... వంటి కర్కశమైన చేష్టలు లేకుండా, సమాజంలోని పరిస్థితులకు అనుగుణంగా డైలాగ్స్ పదిలేవారు. మనం జనాల్ని ఎలా చీట్ చేస్తున్నాం? వారెలా మోసపోతున్నారు? అన్న అవగాహన కలిగించేలా డైలాగ్స్ ఉండేవి. విషయానికి ఎంటర్‌టైన్‌మెంట్ అనే తాలింపేసి వదిలేవారు.

## పోయిన తర్వాత కూడా బతికారు

నాన్నగారు ఎం.పి కావడంతో సినిమాలకు దూరమయ్యారు. ఈక్రమంలో ఫైనాన్షియల్‌గా ప్రాబ్లమ్స్ ఫేస్ చేయాల్సివచ్చింది. ఎవరైనా పొలిటీషియన్ అయితే డబ్బులు సంపాదిస్తారు. కానీ మా ఇంట్లో ఇది రివర్స్ అయింది. నాన్నగారు లంచాలు తీసుకుని పనులు చేసే మనిషి కాదు. మా ఇల్లు నిత్య అన్నసమారాధన కదా! లేదనుకుండా ఆతిథ్యం ఇచ్చేవాళ్లం. ఎం.పి కావడంతో సినిమాలు వదులుకున్నారు. దీంతో ఆర్థికంగా కష్టమైంది. ఇంతలో ఆరోగ్యం క్షీణించింది. తన ఆరోగ్యం గురించి ఆయనెప్పుడూ పట్టించుకునేవారు కాదు. 'ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలి. శ్రద్ధ తీసుకోపోతే పోతారు' అని డాక్టర్లంటే... 'పోయిన తర్వాత బతుకుతాలేండి' అనేవారు. నిజంగా ఆయన పోయిన తర్వాత కూడా బతికారు.

## అదే నా జీవితం అన్నట్టు బతికా

చదువంతా చెన్నయ్‌లో సాగింది. ఆరో తరగతి నుంచే చదువంటే ఆసక్తి సన్నగిల్లింది. ప్లస్ ఒన్ (ఇంటర్మీడియేట్) నుంచి మనసంతా ఫొటోగ్రఫీ మీద మళ్లింది. ఫొటోగ్రఫీ మీదే ఎందుకు మళ్ళిందంటే కరెక్ట్‌గా చెప్పలేను. ఎనిమిదో తరగతిలో బాలాజీ అనే క్లోజ్ ఫ్రెండ్ మామయ్య కెమెరామేన్ దగ్గర అసిస్టెంట్‌గా చేరారు. ఆయనలా చేరడం వల్ల ఫొటోగ్రఫీ మీద ఇంట్రస్ట్ వచ్చిందేమో! బ్రిటీష్ కౌన్సిల్, అమెరికా కౌన్సిల్ కెళ్ళి ఫొటోగ్రఫీ మీద వున్న బుక్స్ అన్నీ తిరగేసేవాణ్ణి. రోజుకి పది గంటలపాటు ఫొటోగ్రఫీ పుస్తకాలే లోకం. ధ్యాసంతా ఫొటోగ్రఫీ మీద మళ్లడంతో మధ్యలోనే ఇంటర్ ఆపేస్తానన్నా. ఫొటోగ్రఫీ నేర్చుకుంటానని ఇంట్లో అడిగితే... కనీసం డిగ్రీ పూర్తి చేయమన్నారు.

ఫొటోగ్రఫీలో థియరి పార్ట్ ఎక్కువ చదవడంతో రూల్స్ ప్రకారమే వెళ్ళిపోతాం. 'ఇది ఇలానే చేయాలి. ఇలా చేస్తేనే కరెక్ట్' అని గిరి గీసి కూర్చుంటాం. పరిస్థితులను బట్టి ఎడ్జస్ట్ కాలేం. జీవితం తెలీదు. బుక్‌ను ఫాలో అవుతున్నామేగానీ, జీవితాన్ని ఫాలో కావడంలేదు. ఇదే విషయాన్ని ప్రసాద్ ల్యాబ్స్ రమేష్‌గారితో చెప్పించారు. కాలిఫోర్నియా ఆర్ట్స్ అండ్ సైన్స్‌లో ఫొటోగ్రఫీలో సీట్ వచ్చింది. 28 లక్షలు ఖర్చవుతుంది. 'అనవసరంగా మీ నాన్నగారి డబ్బును వృథా చేయొద్దు. అమెరికాలో నేర్చుకుని ఇక్కడ తీద్దామంటే ఉపయోగముండదు. ఇక్కడి పరిస్థితులకు అనుగుణంగా తీయాలి' అని రమేష్‌గారు చెప్పారు. ఫొటోగ్రఫీయే జీవితం అన్నట్లు బతికాను. లైటింగ్ ఎలా వేస్తారో అబ్జర్వ్ చేయడానికి డిస్ట్రబెన్స్‌గా ఉందని.... సౌండ్ తీసేసి మరీ న్యూస్ చూసేవాణ్ణి. 'సౌండ్ ఆపేసి న్యూస్ వినడం ఏంటిరా' అని అమ్మ తిట్టేది. అలాగే సినిమాలను కూడా అబ్జర్వ్ చేశాను. ఎటునుంచి లైటింగ్ పడుతుంది. కళ్ల మీదకి లైటింగ్ ఎలా వెళ్తుంది. మనిషి నడుస్తున్నప్పుడు నీడ ఎక్కడ పడుతోంది... ఇలా ప్రతిదీ అబ్జర్వ్ చేశాను. ఫొటోగ్రఫీ అంటే ఎంత పిచ్చుంటే.. పక్కలో కెమెరా పెట్టుకుని పడుకునేవాణ్ణి. డిగ్రీ (బి.కాం) పూర్తి చేశాను. దర్శకులు కె.రాఘవేంద్రరావుగారి తమ్ముడు, కెమెరామేన్ కె.యస్. ప్రకాష్‌గారి దగ్గర పని చేశాను. బెంగుళూరులో 'అడ్వర్‌టైజింగ్ ఫొటోగ్రఫీ' వర్క్ చేశాను.

## 'లెన్స్ తెలుసు... లైఫ్ తెలీదురా'

'కాలమే నిర్ణయిస్తుంది' అన్నట్లు.... నాన్నగారికి ఆరోగ్యం దెబ్బతినడం... హాస్పిటల్ చుట్టూ తిరగడం... ఆర్థిక పరిస్థితులు ప్రతికూలంగా మారాయి. విదేశాల్లో చదివించడం తన వల్ల కాదని నాన్నగారు చెప్పేశారు. పరిస్థితలు ఫొటోగ్రఫీ మీద ఇంట్రస్ట్ పోయేలా చేశాయి. ఇంతలో నాన్నగారు చనిపోయారు.

జీవితంలో రెండే రెండుసార్లు ఏడ్చాను. ఒకటి ఫొటోగ్రఫీ కోర్సు అమెరికాలో చేయలేకపోయినప్పుడు, రెండు నాన్నగారు పోయినప్పుడు. ఆపై దృష్టి షేర్ మార్కెట్ వైపు మళ్ళింది. అక్కడా ప్రాబ్లమ్స్ తప్పలేదు. పోనీ బిజినెస్ చేద్దామా? అనుకుంటే అందులో ఓనమాలు కూడా తెలీవు. ఫొటోగ్రఫీ స్టడీ చేయడంలో భాగంగా... సినిమాలు ఎక్కువగా చూడడంతో... 'డైరెక్షన్' వైపు ఎట్రాక్ట్ అయ్యా. కథలు కూడా రాసుకున్నా. అమ్మ కోప్పడింది. 'నీకు డైరెక్షన్ ఛాన్స్ ఎవరిస్తార్రా... నీకు కెమెరా లెన్స్ గురించి తెలుసు. కానీ లైఫ్ గురించి తెలీదు. లెన్స్ గురించి తెలియడం డైరెక్షన్ కాదు. జీవితం గురించి అవగాహనే డైరెక్షన్. నీకది తెలీదు. నాన్నగారి నీడలో ఎండంటే ఏంటో తెలీకుండా పెరిగావు. టీ కొట్టులో ఏం మాట్లాడుకుంటున్నారు? ఎలా మాట్లాడుకుంటున్నారు? వాళ్ళ జీవితాలెలా వున్నాయి? ఇవన్నీ తెలిస్తేనే ఒక బాలచందర్, కె. విశ్వనాథ్, భారతీరాజా, బాపు, శంకర్... అవుతారు. ఆ పేర్ల వెనకాల ఎన్నో ఏళ్ళ శ్రమ, కష్టం దాగుంది. నీకేమీ తెలీకుండానే ప్రొడ్యూసర్ 24 క్రాఫ్ట్స్ నీ చేతికిస్తాడా?' అంది. మరి ఏం చేయమంటావంటే... యాక్టింగ్ చేయమంది. మరి యాక్టింగ్ రాదుగా అంటే... 'ఎందుకు రాదనుకుంటున్నావ్. నీ బ్లడ్‌లోనే ఉంది' అని వెన్ను తట్టింది. ఫైనల్‌గా ఒప్పుకొని 'సుడిగుండాలు' అనే టెలీ సీరియల్లో నటించాను. అవకాశాల కోసం చెన్నయ్ నుంచి హైదరాబాద్ వచ్చాను. సినిమాల్లో వేషాలు రావడం అంత ఈజీ కాదని అర్థమైంది. నాన్నగారి పేరు చెబితే ఛాన్సులిచ్చేస్తారనుకోవడం కూడా పొరబాటే. ఎందుకంటే ఇది పక్కా బిజినెస్ ఫీల్డ్. మనమేమిటో నిరూపించుకోకుండా అవకాశాలొస్తాయని ఆశించడం అత్యాసే అవుతుందనుకున్నాను. మళ్ళీ చెన్నయ్ వెళ్ళి ఓంకార్‌గారిని అడిగితే 'పవిత్రబంధం' సీరియల్లో అవకాశం ఇచ్చారు. అక్కడ్నుంచి సీరియళ్లలో నటిస్తున్నా. కాకపోతే సినిమాలో నటించాలన్న కోరిక ఉండిపోయింది. తెలుగు ఇండస్ట్రీ హైదరాబాద్‌లో ఉంటే, నేను చెన్నయ్‌లో ఉండిపోయాను. సీరియల్స్‌లో సంపాదించింది ఇంటిమెయిన్‌టెనెన్స్‌కు, ఫ్లైట్లో హైదరాబాద్ వచ్చి వేషాలు అడగడానికే సరిపోయింది. అనేక సీరియల్స్ చేసినా నటుడిగా సంతృప్తి పొందలేదు. సినిమాకున్న పవర్ ఏంటో నాన్నగారిని చూశాను కదా! ఎప్పటికైనా సినిమాల్లో నటిస్తానా? అని తపించాను. ఈ కోరిక ఎప్పటికి తీరుతుందా? అనుకున్నాను. దర్శకుడు ఏలేటి చంద్రశేఖర్‌గారు 'ఒక్కడున్నాడు' చిత్రంలో అవకాశం ఇచ్చారు. అందులో బ్లడ్ కావాలంటూ చేత్తో బోర్డు పెట్టుకుని తిరుగుతుంటాను. చేసింది చిన్న క్యారెక్టరే అయినా లవ్లీ ఎక్స్‌పీరియన్స్.

**మరిన్ని కబుర్లు... వచ్చేవారం....**

## సిత్రం

# అక్కడ చపాతీ 50 పైసలే

**నిజం! అక్కడ ఒక చపాతీ యాభై పైసలే. అంతేకాదు ప్లేటు అన్నం రూపాయి. గిన్నె కూర రూపాయి. కాకపోతే ఉదయం ఎనిమిది గంటలనుంచి పన్నెండు గంటల వరకే ఇవి దొరుకుతాయి. ఆ తర్వాత హోటల్ మూసేస్తారు.**

"ధరలు ఆకాశాన్నంటుతుంటే... ఇంత చవగ్గా ఎక్కడబ్బా అమ్మేది! మా చెవుల్లో పూలు పెడుతున్నారా!" అనిపించొచ్చు. కానీ ఈ హోటల్ గత యాభైఒక్క సంవత్సరాలుగా నడుస్తోందంటే నమ్ముతారా! "ఏంటీ! షాకులమీద షాకులిస్తున్నారు? ఇంత చీప్‌గా అన్ని సంవత్సరాల నుంచి అమ్మడమంటే మాటలా? కళ్లారా చూస్తేగానీ నమ్మేదిలేదు" అనిపించినా ఆశ్చర్యం లేదు. అలా అంటే మాత్రం కోల్‌కొతా వెళ్లాల్సిందే.

ఇప్పటి వరకు మనం చెప్పుకున్న హోటల్ సరిగ్గా ఉత్తర కోల్‌కొతాలోని సీల్దా రైల్వే స్టేషన్‌లో కనిపిస్తుంది. ఇంకా కచ్చితంగా చెప్పాలంటే రైల్ ట్రాక్ మీద అగుపిస్తుంది. దీన్ని నడుపుతున్న ఘనత మాత్రం నలభైయ్యేళ్ల ఫాతిమా బీబీకే దక్కుతుంది. తల్లి నూర్‌బాను నుంచి పదకొండేళ్ల వయసులో ఈ హోటల్ వ్యాపారం చేపట్టారామె.

ఇంతకీ చపాతీని అర్థరూపాయికే అమ్మడం ఎలా సాధ్యం? అనేది ఫాతిమా మాటల్లోనే చూద్దాం. "నేను కొన్ని ఇళ్లల్లో, హోటళ్లల్లో పార్ట్ టైమ్ పని చేస్తాను. సాయంత్రాలు వెళ్లి అక్కడ మిగిలిపోయిన, వదిలివేసిన పదార్థాలను సేకరిస్తాను. ఒక్కోసారి అవి కొద్దిగా మెత్తగాకూడా వుంటాయి. వాటినే మరునాడు ఉదయం ఎనిమిది గంటల నుంచి అమ్ముతాను. రోజూ కనీసం 200 మంది కస్టమర్లు వస్తారు. వీళ్లల్లో ఎక్కువగా భిక్షగాళ్లు, జేబులు కొట్టేవాళ్లు, ప్లాట్‌ఫామ్ మీద బతికేవాళ్లు, పోర్టర్లు... వుంటారు. అయితే ఈ హోటల్‌ని ఇలా రైల్వే ట్రాక్ మీద నడపడానికి అధికారులకు కొద్దిగా లంచం ఇచ్చుకోవాల్సివుంటుంది. ఒక్కోసారి ఇచ్చినా తరిమేస్తుంటారు. అయినా మరుసటిరోజు మళ్లీ తయారవుతుంటాననుకోండి" అంటుంది నవ్వుతూ.

మరి ఫాతిమా హోటల్లో రోజూ భోజనం చేసే వాళ్లేమంటారో చూద్దామా. 'చంచల్' రైల్వే స్టేషన్లో భిక్షమెత్తుకుంటుంది. తనేమంటుందంటే..."మాకు అతికష్టంమీద రోజుకు పాతికరూపాయలు వస్తాయి. ఇందులో తిండికి ఐదురూపాయల కంటే ఖర్చు చేయలేను. ఫాతిమా దగ్గరైతే కడుపునిండా తిన్నా మూడు రూపాయలకంటే కాదు. ఇంక నేను తినేది వేరొకరి ఇంట్లో మిగిలిపోయిందా? చద్దిదా? అనే విషయం ఆలోచించను".

మొత్తం మీద ఫాతిమా రోజుకి 800 రూపాయల వ్యాపారం చేస్తోంది. కస్టమర్లు పెరుగుతుండడంతో తన ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెల సాయం కూడా తీసుకుంటుంది. పనివాళ్లు వుండనే వుంటారనుకోండి!

ఇవండీ చపాతీ యాభై పైసలకే అమ్మే హోటల్ విశేషాలు.

# గుడ్డు మీద డాన్స్ చేసే బొమ్మ

**హాయ్** నేస్తాలూ... మొన్న ఏం జరిగిందో తెల్సా! ఎలా తెలుస్తుందిలే చెప్పకుండా! మొన్న ఓ ఫ్రెండ్ వాళ్ల ఇంటికెళ్లాను. అక్కడ ఓ తమాషా బొమ్మ కనిపించింది. ఎక్కడ కొన్నారంటే 'కొనలేదు. మేమే తయారుచేశాం' అన్నాడు వాడు. అంత చక్కటి బొమ్మను సొంతంగా చేశారంటే...భలే ఆశ్చర్యమేసింది తెల్సా. నేను ఊరుకుంటానా ఏంటి? దాన్ని ఎలా చేశారు? ఏం పెట్టి చేశారు? వంటి విషయాలన్నీ తెల్సుకున్నా. ఇవాళ మీక్కూడా చెప్దామనిపించింది. అందుకే వచ్చేశా!

**ఇంతకీ ఏమేం కావాలంటే...**కోడిగుడ్డు డొల్ల, మందపాటి చార్టు, కత్తెర, స్కెచ్ పెన్నులు.

**ఎలా చేయాలంటే...**ముందుగా కోడిగుడ్డు డొల్లను సగానికి కత్తిరించాలి. తర్వాత సరిగ్గా పోస్టు కార్డు సైజులో వుండే మందపాటి చార్టు ముక్క తీసుకోండి. దానిమీద ఇదిగో బొమ్మలో కనిపిస్తోందే అల్లాంటి అబ్బాయి బొమ్మ వేయండి. అబ్బాయి కింద సగం సున్నా గియ్యండి. సరిగ్గా కాళ్ల దగ్గర. ఇది కోడిగుడ్డులో పట్టేంత వుండాలన్నమాట. ఇప్పడు బొమ్మకు చక్కగా రంగులు అద్దండి. తర్వాత ఏం చేయాలంటే... బొమ్మ చుట్టూ వున్న అనవసరపు చార్టును కత్తిరించేయండి. బొమ్మ పాడవకూడదు సుమా. చివరిగా ఈ బొమ్మను కోడిగుడ్డు లోపల పెట్టాలన్నమాట. మరి బొమ్మ కాళ్ల దగ్గర వున్న అర్థచంద్రాకారం కోడిగుడ్డులో పడుతోందో లేదో పరీక్షించండి. తర్వాత కోడిగుడ్డు డొల్ల లోపల ఒక పక్కన కొద్దిగా మట్టి అతికించండి. తర్వాత బొమ్మను కోడిగుడ్డు డొల్లలో పెట్టండి. అంతే గుడ్డుమీద డాన్స్ చేసే బొమ్మ రెడీ. కావాలంటే దాన్ని కొద్దిగా చేత్తో కదిలించి చూడండి. పడిపోకుండా ఎంచక్కా అటూ ఇటూ ఊగుతూ డాన్స్ చేస్తుంది. భలే బావుందికదూ. దీన్ని మీరు కూడా ఫ్రెండ్స్‌కు బహుమతిగా ఇవ్వొచ్చు. ఆ... అన్నట్టు ఈ పనిలో కావాలంటే అమ్మ సాయం తీసుకోండే.

**- సాహిల్**




# బొమ్మలు ఎక్కడ దాక్కున్నాయో

**నే**స్తాలూ! ఇక్కడ అందమైన జలపాతం, కొండలూ కనిపిస్తున్నాయి కదా. ఇంకాస్త పరిశీలనగా చూడండి ఇంకా ఏవో కనిపిస్తాయి. అర్థం కాకపోతే ఆన్సర్ చూడండి.

జవాబు: మబ్బులు, జలపాతం కలిసేచోట అందమైన అమ్మాయి, ఎడమ చేతి వైపున్న కొండమీద సింహం కనిపిస్తున్నాయి.




# దారి కనిపెడదామా!

**ప**క్కన కనిపిస్తున్న సీతాకోక చిలుకలో నుండి బయటపడే దారి కనిపెట్టండి చూదాం.

# రంగులు వేద్దామా

**హా**య్ చిన్నారులూ, ఈ రోజు రంగులు వేయడం కోసం ఒక స్పేస్ మాన్ బొమ్మ తీసుకొచ్చాం. మీరు ఆ బొమ్మకు రంగులు వేసి అందంగా తయారు చేయాలి సరేనా..





# చుక్కలు కలిపితే...

**చూ**డండి పిల్లలూ! ఈ బొమ్మలోని చుక్కలన్నింటినీ వరసగా కలిపి చూడండి ఒక పెద్ద జంతువు వస్తుంది.

# చతురస్రాలు చేయగలరా

**చి**న్నారులూ.. పక్కన అగ్గిపుల్లలతో చేసిన ఆకారాలు కొన్ని ఉన్నాయికదా. వాటిలో మూడింటిని తీసి వేరేచోట పెడితే మూడు చతురస్రాలు తయారవుతాయి. అవేంటో చూడండి మరి.



# ఎక్కడున్నాయో తెలుసా!

**పై** బొమ్మలో కొన్ని వస్తువులు దాగున్నాయి. మీరు వాటిని చిటికెలో కనిపెట్టాలి. ఇంతకీ అవేంటంటే... క్యాండిల్, పెయింట్ బ్రష్, చేప, క్యారెట్, సీతాకోకచిలుక, పిల్లి, టూత్ బ్రష్, సాక్స్, కళ్లజోడు, గొడ్డలి, స్పూన్, పీర్.

పీపీ

# ఆరోగ్యం.. అమ్మ...అన్నం... బోనాల వైనాలు

అమ్మా బైలెల్లినాదో... తల్లీ బైలెల్లినాదో... తెలుగు ప్రజ లందరికీ వివిధ రూపాలలో సుపరిచి తమైన ఈ పాట తెలంగాణా బోనాల్లో మార్మోగు తుంటుంది. హైటెక్‌యుగం లోనూ కొనసాగుతున్న అలనాటి విశ్వాసాల సమ్మేళనం బోనాలు. ఆరోగ్యం, అమ్మ దేవత,అన్నం ప్రసాదం మూడింటితో ముడిపడిన అచ్చమైన జనం పండుగ బోనాలు. గోల్కొండ బోనాలుగా ప్రారంభమై అన్ని గ్రామాలలో నెల రోజుల పాటు జరిగే బోనాలు తెలంగాణా జానపదుల జాతరల్లో ముఖ్య మైంది. ప్రత్యేకమైంది కూడా. మేళతాళాలు, డప్పులు దరువులు, శివసత్తులు, పోతరాజుల చిందుల మధ్య అత్యంత వైభవంగా సంద డిగా జరిగే బోనాల పండుగ ఆషాఢ మాసంలో జరుగుతుంది. ఇప్ప టికి నాలుగు వందల ఏళ్ల నుంచి ఈ ఉత్సవాలు జరుగుతున్నాయం టారు. ఈ వేడుకలు ఒక విధంగా కుల మత తేడాలు లేకుండా స్థానిక ప్రజలం దరి పండుగలుగా జరుగు తాయి.

ఒకప్పటి గ్రామీణ ప్రజల విశ్వాసాలతో ముడి పడిన బోనాలు వాస్తవంలో అంటు వ్యాధుల నుంచి కాపాడేందుకు అమ్మతల్లికి పెట్టే భోజనాలే. అంటే నైవేద్యం అన్నమాట. గోల్కొండ కోటను పాలించిన సుల్తానులు కూడా వీటిని ఆచరించడంతో ఇవి రాజధాని నుంచే ప్రారంభించడం మొదలైనాయి. బోనంగా పిలవబడే పాత్రలో దేవికి ప్రసాదాన్ని అర్పిస్తారు. మహిళలు ఉదయాన్నే నిద్రలేచి తలస్నానం చేసి శుచిగా బోనం ప్రసాదాన్ని తయారు చేస్తారు. దాన్ని బోనం అనే పాత్రలో పెట్టి అది అపవిత్రం కాకుండా దీపం వెలిగిస్తారు. ముఖాలకు పసుపు రాసుకుని తడి గుడ్డలతో ఆలయానికి తరలి వెళతారు. పసుపు నీరు పాత్రల్లో నింపుకొని వేపమండలను వాటిలో వుంచుతారు. దేవత కొలువు తీరిన ప్రదేశానికి ఎదురుగా ఆ నీటిని సమర్పిస్తారు. దీన్నే సాక అంటారు. నీరు వేపాకులు కలిస్తే చల్లగా వుంటాయి గనక తమ జీవితాలు కూడా చల్లగా సాగిపోయే విధంగా దీవించాలని కోరుకుంటారు.

బోనాల పండుగ రోజున వివిధ చోట్ల నుంచి జనం గుంపులు గుంపులుగా రకరకాల ఆహార పదార్థాలు సిద్ధం చేసుకుని అందంగా అలంకరించిన బండ్లలో బయలుదేరతారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసిన తర్వాత అమ్మ తల్లికి అర్పించగా మిగిలిన దాన్ని ప్రసాదంగా భావిస్తారు. ఈ బండ్లను ఫలహారపు బండ్లు అంటారు. అయితే అసలు ఆకర్షణ వీటి ముందు విన్యాసాలు చేసే పోతురాజులే!

### రంగు రంగుల తొట్టెలు..

బోనాల పండుగ సందర్భంగా తాము కోరుకునే కోర్కెలు తీర్చాలంటూ వెదురు కర్రలు, రంగు కాగితాలతో డబ్బాల వలె తయారు చేసిన తొట్టెలను కూడా సమర్పించుకుంటారు. దేవాలయ ముఖ ద్వారం దగ్గర మొక్కుల కింద ఈ తొట్టెలను కడతారు. అనేక చోట్ల కనక దుర్గ దేవాలయాల దగ్గర చెట్లకు ఈ విధమైన తొట్లు లేదా వుయ్యాలలు వూగడం చూస్తూనే వుంటాం. విశ్వనాథ్ తీసిన 'సప్తపది' చిత్రంతో సహా చాలా చిత్రాల్లో కూడా ఇలాంటి సన్నివేశాలుంటాయి.

### పోతురాజుల కథా కమామిషు....

లంగోటి అనబడే కట్ డ్రాయర్ వంటి అంగవస్త్రంతో కాళ్లకు గజ్జెలు, నోట్లో నిమ్మకాయలు, కళ్లకు కాటుక, నుదుట పెద్ద కుంకుమ పెట్టుకుని పసుపు తాడును కొరడగా ఝుళిపిస్తూ పోతురాజులు వూరేగుతారు. చుట్టూ మార్మోగే తప్పట్ల శబ్దానికి అనుగుణంగా చిందులేస్తారు. గజ్జెల సవ్వళ్లతో లయబద్ధంగా నృత్యం చేస్తారు. వాస్తవానికి వారి రూపం పసిపిల్లలు చూస్తే భయపడేలా వుంటుంది. ఒకప్పుడు జంతువులను బలి ఇచ్చి ఆ మేకపోతు తలలను చేతిలో పట్టుకుని గుడిచుట్టూ రక్తం చల్లుతూ తిరిగేవారినే పోతురాజులని పిలవడంతో ఈ పేరు వచ్చింది. వారు ఇతరత్రా పెద్ద పనులు చేయరు కనకే 'తిండికి తిప్పరాజు, పనికి పోతరాజు' అన్న మాట పుట్టింది.

### పచ్చికుండపై రంగం..

అన్ని విధాల మాతృస్వామిక సమాజంతో ముడిపడిన బోనాల పండుగలో అడుగడుగునా మహిళలకు ప్రాధాన్యత కనిపిస్తుంది. ఆలయ గర్భగుడిలో అవివాహిత పచ్చికుండపై కాలు పెట్టి ఏకదీక్షగా అమ్మవారినే చూస్తూ పూనకంలోకి వెళ్లిపోతుంది. బసివినిలు, జోగినుల తరహాకు చెందిన వారిని ఇందుకు నియోగిస్తారు. పూనకం

# విశ్వాసాలూ, విజ్ఞాన పాఠాలూ!

పండుగల జాతర్లు ఏవైనా ప్రజల విశ్వాసాలతో ముడిపడినవే. ఆ విశ్వాసాలు విజ్ఞాన పరమైనవి కానక్కర్లేదు. విజ్ఞాన శాస్త్రం ఇంతగా అభివృద్ధి చెందక ముందు తమ కష్టనష్టాలకు అనారోగ్యాలకూ కారణం తెలియని ప్రజలు అందుకు అమ్మతల్లి కోపమే కారణమనుకున్నారు. ఆటలమ్మ, చిన్నమ్మ పెద్దమ్మ వంటి పేర్లు వ్యాధులకు పెట్టుకున్నారు. ఆమెకు మంచి చేసుకోవడానికి రకరకాల పూజలుచేసి, నైవేద్యాలు సమర్పించడం మొదలెట్టారు. టీకాలు వచ్చిన కొత్తలో డాక్టర్లు వాటిని వేయడానికి పోతే గ్రామీణుల నుంచి తీవ్రమైన ప్రతిఘటన ఎదురయ్యేది. టీకాలు వేసుకోవడమంటే దేవతను అవమానించడమనుకుని వారు డాక్టర్లను తరిమి కొట్టేవారట.

మరి అమ్మను మంచి చేసుకోవాలంటే తమకు తెలిసిన మంచి ఆహారం పెట్టాలి. అందులో తమకు బాగా ఇష్టమైన మాంసాహారమే ఆమెకూ ఇష్టమై వుంటుంది కనక జంతుబలులివ్వడం మొదలెట్టారు. మరీ ముఖ్యంగా జాతర్లలో బలి పొలి ప్రధానమైనవిగా వుంటాయి. బలిచ్చిన మేకపోతును లేదా దున్న పోతు రక్తాన్ని దేవత ముందుంచిన అన్నం రాశిపై చల్లుతారు. ఆ రక్తసిక్తన్నాన్ని వూరి వీధుల్లోనూ పొలిమేరల్లోనూ వెదజల్లుతారు. ఈ విధంగా చేయడం వల్ల అంటువ్యాధులు రాకుండా అక్కడే ఆగిపోతాయనే నమ్మకం ఇందుకు కారణం. అలా బలి మేకను మేళతాళాలతో తీసుకువెళతారు. దాని పక్కనే వీరంగాలు వేస్తారు. అయితే విశ్వాసాలు ఎలా వున్నా జంతుబలులు అనుమతించరానివని అందరూ అవగాహనకు రావడంతో ప్రభుత్వం వాటిని నిషేధించింది. అయినా సరే ఇప్పటికీ వందలాది సందర్భాల్లో ఏదో ఒక విధంగా జంతువుల తలలు తెగుతూనే వుంటాయి. వీటిని సమర్ధించనవసరం లేదు.

ఈ కోలాహలంలో ఎవరో ఒకరికి దేవత పూని గ్రామానికి సంబంధించిన వివిధ విషయాలు రాబోయే కష్టాలు అరిష్టాలు ఏకరువు పెడుతుంది. దీన్నే శివమెక్కడం, శిగమెక్కడం, బోనాల పండుగలోనైతే రంగం చెప్పడం అంటారు.

అలాగే ఎక్కడైనా ఎప్పుడైనా ఇలాంటి జాతరల్లో వేపాకు, నిమ్మకాయలు, కొబ్బరి కాయలు పగలగొట్టడం, పసుపు, కుంకుమ, ధూపం వేయడం వంటివి తప్పని సరిగా జరుగుతాయి. ఇవన్నీ వారికి తెలిసిన ఔషధ గుణాలు కలిగినవే. దీన్ని బట్టి కొందరు ఆ విశ్వాసాలకు లేనిపోని విజ్ఞానం అంటకట్టడానికి ప్రయత్నం చేస్తుంటారు. మానవ సమాజంలో ఏ సంప్రదాయంలోనైనా జీవితావసరాలు, అప్పటికి వున్న విజ్ఞాన వికాసం కనిపించడం కద్దు. కాని ఆ పేరుతో నిరాధారమైన విశ్వాసాలను బలపర్చడం తప్పవుతుంది. తరతరాలుగా వేళ్లూనుకున్న ఆచార సంప్రదాయాలను కించపర్చకుండానే సమాజాన్ని శాస్త్ర విజ్ఞానం వైపు మరల్చేందుకు కృషి చేయడం విద్యావంతుల ఆలోచనాపరుల బాధ్యత. ఆధునిక మూఢ విశ్వాసాలు వెర్రితలలు వేస్తున్న నేటి కాలంలో అది మరింత అవసరం. లేకపోతే ప్రతి నమ్మకానికి లేనిపోని విజ్ఞానం ఆపాదించడం జరుగుతుంది.



వచ్చాక ఆమె రంగం చెప్పడం మొదలెడుతుంది. ఆ విధంగా చెప్పేవన్నీ నిజమవుతాయని కూడా నమ్మకం. రంగంలో చెప్పిన మాటలకు విశేషమైన విశ్వాసంతో స్వీకరిస్తారు. సికిందరాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి ఆలయంలో జరిగే రంగం కార్యక్రమంలో స్వర్ణలత అనే ఆమె భవిష్యవాణి వినిపిస్తుంది. అంతకు ముందు ఆమె సోదరి స్వరూప, ఇంకా ముందు వారి తల్లి రంగం చెప్పే వారు. దశాబ్దాలుగా వీరి పూర్వీకులే బోనాల వేడుకలను నిర్వహిస్తున్నారు.

**తర్వాతి ఘట్టం గావు...**

ఇక రంగం ముగిశాక గావు అనే మరో ఘట్టం వుంటుంది. పోతురాజులు అమ్మను శాంతింపచేసేందుకు సొరకాయ గుమ్మడి కాయలు బలిఇస్తారు. దీన్నే గావు అంటారు. ఆ పిమ్మట గజ వాహనంపై దేవతా విగ్రహాన్ని వివిధ ప్రాంతాల్లో వూరేగిస్తూ అంతకు ముందు తెచ్చిపెట్టిన ఘటాలను తొలగిస్తారు. ఆ విధంగా బోనాల వుత్సవం ముగుస్తుంది.

**ఎందుకీ బోనాలు?**

మిగిలిన అనేక పల్లె వేడుకల్లాగే బోనాలు కూడా ప్రజల విశ్వాసాల నుంచే పుట్టింది. పూర్వం విపరీతంగా అంటువ్యాధులు రావడంతో వాటికి అమ్మ ఆగ్రహమే కారణమని భావించి ఆమెను ప్రసన్నం చేసుకోవడానికి బోనాల సమర్పణ మొదలెట్టారు. వానాకాలంలో వ్యాధులు త్వరితంగా వ్యాపిస్తాయి. అందుకు కారణమేమిటో అప్పటికి తెలియదు. మశూచి,కలరా, పొంగు వంటి వ్యాధులు పెద్ద ఎత్తున రావడానికి అమ్మ కోపమే కారణమని అప్పటి ప్రజలు భావించేవారు. పోచమ్మ తల్లిని శాంతింప చేస్తే ఇది తగ్గిపోతుందని అనుకున్నారు. అందుకే ప్రతి చోటా ముఖ్యంగా పోచమ్మ గుడికే ఎక్కువగా పూజలు చేస్తారు. పోచమ్మతో పాటు క ట్టమైసమ్మ, ముత్యాలమ్మ, లకు కూడా బోనాలు ఎక్కువగా సమర్పిస్తారు. శ్రావణం రాగానే పోచమ్మ గుడిని ప్రత్యేకంగా అలంకరిస్తారు. పసుపు కుంకాలతో పువ్వులు నిమ్మకాయలతో తీర్చిదిద్దుతారు.



# జనం పండుగలే జాతర్లు!

వివిధ మతాల వారికి వివిధ రకాలైన పండుగలుంటాయి. అందులోనూ భిన్న విశ్వాసాలను విలీనం చేసుకున్న హిందూ మతంలో అన్నిటికన్నా ఎక్కువ పండుగలున్నాయి. శైవుల కన్నా వైష్ణవులకు పండుగల తాకిడి ఎక్కువ. శివుడు ప్రాచీన అనార్య దేవుడు కావడమే దీనికి కారణమై వుండొచ్చు. పండుగలతో పాటు పల్లె ప్రజల ఉత్సవాలు, జాతరలు, వేడుకలు,కొలుపులు, తిరునాళ్లు చాలా జరుపుకొంటారు. ఇందులోనూ కొన్ని మత విశ్వాసాలతో ముడిపడి వున్నా ఎక్కువ భాగం స్థానికమైనవే. ప్రాంతాల వారీగానే గాక ఒకో వూరికే పరిమితమైన వేడుకలు కూడా వుంటాయి. ఇందులోనూ ఉత్సవాలు దేవతా పరంగా వు ంటాయి.వాటిలో దేవతలను ఆరాధించడమే ప్రధానం.

ఇందుకు భిన్నంగా జాతరలు తమకు కష్టం కలిగినప్పుడు ఎవరైనా దేవతను పూజించే పద్ధతులలో మొదలవుతాయి. గ్రామ దేవతలకు, కుల దేవతలకు, ఇంటి దేవరలకు ఏడాదికొక్క సారిగాని లేదా ఏదైనా కష్టం పోవాలనుకున్నప్పుడు గాని జాతర చేస్తారు. గంగ జాతర వంటివి వర్షాల కోసం చేస్తారు. పంటల కోసం, ఆరోగ్యం కోసం ఇలా రకరకాల పేర్లతో దేవతా పూ జ చేసేందుకు జాతరలు తల పెడతారు. కాల క్రమంలో జాతరలు కూడా ఏడాదికి ఒక నిర్ణీత సమయంలో చేయడం మొదలైంది. మామూలుగా జాతరల్లో కర్మకాండలు ఆచార సంప్రదింపులు కలగాపులగంగా వుంటాయి.

జాతరలు ఎక్కువగా స్త్రీ దేవతలకే జరుగుతాయి. ఎల్లమ్మ, పోచమ్మ,పోలేరమ్మ, మైసమ్మ, బాలమ్మ,గంగమ్మ,చెంగాళమ్మ, కలుగోళమ్మ,కంకాళమ్మ, అక్కమ్మ, అంకమ్మ, పెద్దమ్మ, ముత్యాలమ్మ ఇలా వూరి పొలిమేరల్లోని గుళ్లలో ఎందరెందరో గ్రామ దేవతలు! వున్నంతలో ఆంధ్ర ప్రదేశ్‌లో ఎల్లమ్మ జాతర ప్రాచీనమైందంటారు పరిశోధకులు.మిగిలిన పండుగల వలె గాక జాతర్లలో కుల మత భేదాలు లేకుండా పాల్గొంటారు. అది అందరి వేడుకగా జరుగుతుంది.

మానవుల అతి పురాతనమైన దేవతలు అమ్మ దేవతలే. పోచమ్మ, పోలేరమ్మ, కట్టమైసమ్మ,గంగానమ్మ వంటి పేర్లలోనే వారికి జీవితాలకూ ప్రకృతికీ మధ్య గల సంబ ంధం తెలుస్తుంది. వీరినే గ్రామ దేవతలనడం పరిపాటిగా మారింది. ప్రతివూళ్లోనూ మొదట్లోనే ఇలాటి దేవతల విగ్రహాలు వుండటం చూస్తాం. ఈ గుళ్లను చాలా వరకూ సామాజికంగా వెనకబడిన తరగతుల వారే నిర్వహిస్తుంటారు. అనేక చోట్ల పూజారులుగా మహిళలు వుంటారు.ఇదంతా ఆ దేవతల ప్రాచీనతనే తెలియజేస్తుంది.

కాలం గడిచే కొద్దీ అమ్మ దేవతల స్థానంలో కాళి లేదా మహంకాళి, దుర్గ, కనకదుర్గ, జగదంబ వంటి వారొచ్చారు. పోచమ్మను కాత్యాయని అని, ఎల్లమ్మను రేణుక అని సంస్కృతీకరించారు. అది వరకటి అమ్మ దేవతలే అయినా వీరిని తర్వాత తర్వాత దేవుళ్ల భార్యలుగా మార్చేశారు. ఆ విధంగా పూజా ప్రపంచంలోనూ పురుషాధిక్యత ప్రవేశించింది. గిరిజనులు, జానపదులపై నాగరికులు అనార్యులపై ఆర్యులు ఆధిక్యత సాధించే కొద్దీ మత విశ్వాసాలూ, పూజా విధానాలూ కూడా మారిపోయాయి. పట్టణాలు నగరాల విస్తరణతో గ్రామ దేవతలు కాస్త నగరాల్లో చోటు సంపాదించారు. అలా ఆధునికత మధ్య అమ్మ దేవతల అవశేషాలు మిగిలిపోయాయి. అయితే అంతకు ముందు అనేక విశ్వాసాలతో వారిని పూజించిన పద్ధతులు మాత్రం ఇంకా కొనసాగుతూనే వున్నాయి.అలాటి విలక్షణ వేడుకే బోనాలు. ఈ వేడుకల్లో గుంపులు గుంపులుగా తరలివెళ్లే మహిళలు పాడే అమ్మ పాటలు పెద్ద ప్రత్యేకతగా చెప్పాలి.వీటిలో ఆధ్యాత్మికత కన్నా జీవిత వాస్తవికతే ఎక్కువగా వుంటుంది. కాలం మారిన కొద్దీ ఈ వేడుకల్లో రికార్డులు వేయడం సినిమా సంగీతం బాగా పెరిగిపోయాయి. అదే విధంగా బోనాలు సమర్పించే మహిళల కన్నా ముందు చిందులేసే యువకుల హడావుడి ఎక్కువగా కనిపిస్తోంది. ఇక రాజకీయ నాయకుల ప్రచారానికి ఇదో పెద్ద సందర్భంగా మారింది. అలా పాత పండుగలో కొత్త కళలు వచ్చాయి. హైదరాబాద్‌లోనైతే ఆ సమయంలో ట్రాఫిక్ ఆంక్షలు కూడా విధిస్తుంటారు.

### తెలంగాణా పల్లెపట్టుల్లో.....

రాజధాని నగరంలో సంరంభాలు అలా వుంచి తెలంగాణాలోని పల్లెసీమల్లో బోనాలు వైభవంగా నిర్వహిస్తారు.

ఇళ్లను కన్నుల పండుగ్గా అలంక రిస్తారు. మామిడాకుల తోరణాలు కడతారు. మూడు లేదా అయిదు కొత్త కుండలు తెస్తారు. పూజాదికాల తర్వాత తయారు చేసిన పిండి వంటలను వాటిలో పెడతారు. ఆ కుండను కూడా పసుపు కుంకుమలతో అందంగా తీర్చిదిద్ది మామిడాకుల కంకణం కడతారు. దానిపైన ప్రమిద వెలిగిస్తారు.

సాయింత్రం ఆరు గంటలు కాగానే వూరి నడిబొడ్డున కొమ్ము బూర వూదుతారు. తర్వాత వివిధ మంగళ వాయిద్యాలు.. ఆ శబ్దం వినగానే ప్రతి గృహిణీ కొత్త వస్త్రాలు ధరించి అలంకరించుకుని దీపాలు వెలిగించుకుని బోనం కుండలతో బయలు దేరి వూరి మధ్యకు చేరుకుంటుంది. అందరూ వచ్చారో లేదో చూసు కుని పోచమ్మ గుడివైపు కదులుతారు. సంధ్యవేళ వేలాది ప్రమిదలు తలలపై పెట్టుకున్న మహిళలు కదలిపోవడం సుందర దృశ్యంగా గోచరిస్తుంది. వారితో పాటే వూరే తరలివస్తుంది.అప్పటికే తీర్చిదిద్దిన పోచమ్మ గుడి దగ్గర ముందు కొబ్బరి కాయలు కొట్టి తర్వాత పసుపు కుంకుమలతో అర్చించి ఆ పైన బోనాలు సమర్పిస్తారు. సాధారణంగా శ్రావణ బహుళ పాడ్యమి మొదలు అమావాస్య వరకూ ఈ బోనాలు తీస్తుంటారు

ఫొటోలు: **కె. నరహరి** ❄




# చిల్లిగవ్వ కూడా ఇవ్వరంట

మా తాతగారికి ఐదుగురు కొడుకులు. అందులో ఒక కొడుకును దత్తత ఇచ్చారు. మిగిలిన నల్గురు అన్నదమ్ముల్లో పెద్దతనికి, చిన్నతనికి ఆస్తిలో ఎటువంటి వాటా ఇవ్వలేదు. చిన్న కొడుకు చాలా అమాయకుడు. మొత్తం ఆస్తిని రెండవ, మూడవ కుమారులు (అంధవరపు గోవిందరావు, నాగేశ్వరరావు) స్వాధీనం చేసుకొన్నారు. ఆస్తి వివరాలు తెల్పమంటే... 40 ఖాళీ స్థలాలు, భూములు, భవనాలు, అత్తగారి పేరిట 20 లక్షల రూపాయలు బ్యాంకు బాలన్స్, రెండు వందల తులాలు బంగారం, పది కేజీల వెండి మొదలైన వివరాలు తెల్పారు. సమయానికి ఇదే సరైన అవకాశం అంటూ మొత్తం ఆస్తిని, బంగారం, వెండి, ఆస్తి వివరాలు మొదలగు డాక్యుమెంట్స్‌ని స్వాధీనం చేసుకున్నారు. చిన్న కొడుకు తన వాటా ఆస్తిని అన్నదమ్ములను అడిగితే తమ దగ్గర ఆస్తులేమీ లేవన్నారు. కోర్టు చుట్టూ తిరిగి ఖర్చు పెట్టే స్తోమత అతనికి లేదు. ఇకపోతే ఈ ఊరి పెద్దలతో అడిగిస్తే మా దగ్గర ఒక లాగా ...వాళ్ళ దగ్గర ఒక లాగా చెప్తున్నారు. మా తాత గారు చిన్న కొడుకు పేర రాసిన ఆస్తులు , సమిష్టిలో ఉన్న ఆస్తులు మొదలైనవన్ని ఇద్దరన్నదమ్ములు వాళ్ళ భార్యపేర, పిల్లల పేర ఫోర్జరీ చేశారు. మా దగ్గర ఎటువంటి ఆస్తి డాక్యుమెంట్స్ (కాపీలు కూడా) లేవు. మా తాతగారు, నానమ్మలు కూడా సంవత్సరం క్రితం చనిపోయారు. పెద్ద కొడుకూ చనిపోయాడు. పెద్దకొడుకు, చిన్న కొడుక్కి ఆస్తిలో ఎటువంటి పంపకాలు జరగలేదు. చిన్న కొడుకు ...తల్లిదండ్రుల ఆస్తులను స్వాధీనం చేసుకున్న అన్నదమ్ములను అడిగితే ఈ ఆస్తిలో చిల్లిగవ్వ కూడా ఇవ్వమన్నారు. ఇందులో మీకు ఏవాటా రాదు, ఎవరికి చెపుతారో, ఏం చేస్తారో చేసుకోండి అంటున్నారు. పైన చెప్పిన వివరాలు పరిశీలించి సలహా ఇవ్వగలరు.

అంధవరపు సుమన్, పలాస.



జి. ఎల్. నరసింహారావు

హైకోర్టు న్యాయవాది, 9848994240

ఈ విషయం మీకు సంబంధించినదే కావున పైన ఉదహరించిన కార్యాలయాల్లో ఎవరినైనా సంప్రదించి సమాచార, విషయ సేకరణ జరిపించండి. తరువాత మిగతా అన్నదమ్ములు ఆ ఆస్తిని తమ భార్యలు, పిల్లల పేరకు మార్చారంటున్నారు. అలా మార్చినా కూడా ఆ ఆస్తి తాతలది. అందువలన సమిష్టి ఆస్తి అవుతుంది. దాంతో న్యాయ ప్రక్రియ ప్రారంభం అవుతుంది. న్యాయస్థానానికి వెళ్ళే స్తోమతలేకున్నా లీగల్ ఎయిడ్ సంస్థని సంప్రదిస్తే ఏ ఖర్చు లేకుండా న్యాయం పొందే అవకాశం ఉంటుంది.

# మా డబ్బు మాకొచ్చేదెలా?

మా బావగారు మా దగ్గర రెండు లక్షల రూపాయలు తీసుకున్నారు. ఇప్పటికీ అతను చెల్లించడం లేదు. మేం కోర్టులో కేసు వేశాం. అతడికి ఊళ్ళో ఇంకా చాలా అప్పులున్నాయి. వారెవరూ కోర్టుకెళ్ళలేదు. మేమే వెళ్ళాం. అతడికి ఒక ఇల్లు ఉంది. ఆరు లక్షల రూపాయల వరకు ఖరీదు చేస్తుంది. అప్పులు మాత్రం 10 లక్షల వరకు ఉండవచ్చు. మా డబ్బులు మాకొచ్చేదెలా? మేమేమైనా నష్ట పోవలసివస్తుందా?

కావ్య, హైదరాబాద్

మీరు దావా వేశారు. కావున మీ డిక్రీని బట్టి మీకు డబ్బులు వచ్చే అవకాశం ఉంటుంది. ఇప్పటికీ అతడు ఈ ఇల్లు అమ్మకుండా, కుదవ పెట్టకుండా ఉండేట్లుగా జడ్జిమెంట్ కన్న ముందే కోర్టులో అటాచ్‌మెంట్ చేయించండి. దాంతో మీ డబ్బుకు గ్యారంటీ ఉంటుంది. లేదంటే మిగతా అప్పులవాళ్ళు బలవంతంగా రిజిస్ట్రేషన్ చేయించుకునే అవకాశం ఉంటుంది. అలా అయినట్లయితే మీకు కోర్టు డిక్రీ పొందినా అతడి వద్ద చెల్లించడానికి డబ్బులు లేకుంటే డిక్రీ డబ్బులకు మీరు కష్టపడాల్సి వస్తుంది.

# ఆరు నెలలు తగ్గించారు...

నేను 1979లో పోలీసు జీపు డ్రైవర్‌గా చేరాను. అపాయింట్‌మెంట్ ఆర్డర్‌లో నా పుట్టిన తేదీ 10-10-1952గా నమోదు అయ్యింది. నేను 5వ తరగతి వరకే చదివాను. ఆ ఒరిజినల్ సర్టిఫికెట్ వారికి ఇచ్చాను. నా రిటైర్‌మెంటు దగ్గరకొచ్చింది. ఇప్పుడు వారు, నేను పుట్టిన తేదీ తప్పుగా ఇచ్చానని ఆరు నెలలు తగ్గిస్తూ వారంతట వారే ఇంకో తేదీ రాసుకున్నారు. నేను పై అధికారుల దృష్టికి ఈ విషయం తీసుకుపోయినా లాభం లేకపోయింది. నన్నేం చేయమంటారు.

కావ్య, హైదరాబాద్

5వ తరగతి పాఠశాల నుండి మీ సర్టిఫికెట్ తీసుకువచ్చి వారికి సమర్పించండి. అయినప్పటికి వారు అంగీకరించకపోతే మీరు ట్రిబ్యునల్‌ని ఆశ్రయించండి. మీకు అపాయింట్‌మెంట్ ఆర్డర్‌లో ఉన్న తేదీ ప్రకారం మీరు సర్వీసులో ఉండవచ్చు. వారు అటువంటి ఉత్తర్వులు జారీ చేసినట్లయితే ఆ ఉత్తర్వుల జారీ కోసం కూడా మీరు ట్రిబ్యునల్‌ని ఆశ్రయించవచ్చు.



# ఏజెన్సీలో ఏరువాక

## గిరిజనుల భూమిపూజ సంబరాలు



**తొలకరి పలకరించగానే మన గ్రామాల్లో ఏరువాక సాగడం ఆనవాయితీ. ఏరువాక రోజు పశువులను శుభ్రంగా కడిగి వంటిపై బుక్క చల్లి, కుంకుమ బొట్లు పెట్టి, మెడలో మువ్వలు కట్టి వాటికి పూజలు చేసి, కొటేరు వేసుకుని వెళ్లి భూమిని దున్నడంతో వ్యవసాయ పనులు ప్రారంభమయినట్లు. ఈ పండుగను ఏరువాక అంటాం. తెలుగు చలన చిత్రాల్లోనూ "ఏరువాకా సాగారో రన్నో చిన్నన్న నీ కష్టమంతా తీరునురో రన్నోచిన్నన్న... సాలుతప్పక కోండ్ర వేసుకో విత్తనంబు విసిరిసిరి సల్లుకో " అనే పాట బహుళప్రజాదరణ పొందింది. ఇదంతా మీరు ఒకప్పుడు చూసుంటారు. ప్రస్తుతం వ్యవసాయంలోకి ట్రాక్టర్లు రంగప్రవేశం చేశాక ఈ పండుగ కూడా అటకెక్కింది. కానీ మన రాష్ట్రం మొత్తంలోనే ఏరువాక పండుగను ఎంతో ప్రతిష్టాత్మకంగా, ముఖ్యమైన పండుగగా జరుపుకునే వారూ ఉన్నారు. వీరిని చూడాలనుకుంటే ఒక్క సారి ఖమ్మం జిల్లా భద్రాచలం అటవీప్రాంతంలోని గిరిజన పల్లెలను సందర్శించాల్సిందే.**

పచ్చదనం నిండుకున్న పల్లెల్ని మీరెప్పుడైనా చూశారా? కల్మషం లేని మనుషులను ఎప్పుడైనా చూశారా? నాది నాది అని అనే నేటి రోజుల్లో మనది అనే సమిష్టితత్వం ఎక్కడైనా చూశారా? కష్టమైనా, సుఖమైనా కలిసి పంచుకునే మనుషులను ఎప్పుడైనా కలిశారా? వీటన్నిటి కలబోతే భద్రాచలం అటవీప్రాంతంలోని పల్లెల్లో నివసిస్తున్న గిరిజనులు. వీటన్నిటిని ఒక్కసారిగా మీరు చూడాలనుకుంటే ఏజెన్సీలో ఏరువాక పండుగను మీరు చేస్తే చాలు. ఈ ఏరువాకనే గిరిజనులు భూమిపూజ పండుగగా జరుపుకుంటారు. ఈ పండుగ సంబరాలను పసివాళ్లనుండి పండుముసలివాళ్ల వరకూ ఈ పండుగలో పాలుపంచుకుంటారు. ఈ పండుగను చూసేందుకు గిరిజన ప్రాంతాల్లో ఉండే



గిరిజనేతరులు ఎంతో ఆసక్తిని కనబరుస్తారు. ఈ పండుగ వేడుకలను కొన్ని ప్రాంతాల్లో మూడురోజులు, మరో కొన్ని ప్రాంతాల్లో వారంరోజుల పాటు నిర్వహిస్తారు. ఈ పండుగకు బంధుమిత్రులను, ఆడపిల్లలను పుట్టింటికి తీసుకొచ్చుకుంటారు. కంప్యూటర్ ముందు కూర్చొని కలుపుమొక్కలు ఏరుకునే నేటి రోజుల్లో తరతరాలుగా వస్తున్న ఆచార వ్యవహారాలను సంప్రదాయబద్ధంగా ఎంతో భక్తి శ్రద్ధలతో ఈ పండుగను చేసుకోవడం మనకు ఒకింత ఆశ్చర్యం కలగక మానదు. ప్రతి యేటా జూన్, జులై మాసాల్లో తొలకరి వర్షం పడగానే గిరిజనులు ఈ పండుగను చేసుకుంటారు.

### భూమి పండుగ విశిష్టత

ప్రతియేటా తొలకరి వర్షం పడగానే గిరిజనులు వారి ఆరాధ్య గ్రామ దేవతకు పూజలు చేస్తారు. గ్రామ దేవతను కొలుచుకుని పూజలు నిర్వహించి జంతుబలి ఇస్తారు. జంతుబలి ఇవ్వకుండా ఏరువాక ప్రారంభిస్తే ఆ గ్రామానికి అరిష్టంతో పాటు, పంటలు పండవనే నమ్మకం వీరిలో తరతరాలుగా బలంగా నాటుకుపోయింది. ఈ కట్టుబాటును అధిగమిస్తే గ్రామానికి ఏదో నష్టం జరుగుతుందని అనాదిగా గిరిజన పెద్దలు చెబుతూ వస్తున్నారు. ఏరువాక సాగి విత్తనాలు విత్తుకోవడమే ఈ పండుగ విశేషం. ఈ పండుగ చేసుకునే క్రమంలో గిరిజనులు వారివారి సంప్రదాయాల ప్రకారం చేసే వేట, మహిళల రేలపాటలు, ఎంతో ఆకర్షణీయంగా ఉంటాయి.

### పండుగ చేసుకునే విధానం

తొలకరి చినుకులు పడగానే గిరిజన గ్రామాలలో ఉన్న మగవాళ్లంతా గ్రామ నడిబొడ్డున కూర్చొని పూజారి, గ్రామపెద్దల సమక్షంలో భూమిపూజ చేసుకునే రోజును ఖరారు చేస్తారు. పండుగ మొదటిరోజున గ్రామ శివారులో దేవరచెట్టు వద్ద ఉన్న దేవతకు పూజలు చేసి ఒక ఎద్దును గానీ, పందినిగాని బలిస్తారు. ఆ మాంసాన్ని గ్రామస్తులంతా అక్కడే వండుతారు. ఆ రోజు మహిళలంతా గ్రామంలో రేల పాటలు పాడుతూ నృత్యాలు చేస్తూ వచ్చిపోయే వారి నుండి డబ్బులు వసూలు చేస్తారు. ఇది వీరి ఆనవాయితీ. సాయంత్రం దేవరచెట్టు వద్దకు చిన్నా పెద్ద తేడా లేకుండా అందరూ చేరి సమిష్టిగా వంటలను ఆరగిస్తారు. దాంతో మొదటిరోజు పండుగ పూర్తవుతుంది.

### పండుగలో ముఖ్యఘట్టం వేట

భూమి పండుగలో ముఖ్యఘట్టం వేట. రెండవ రోజు తెల్లవారు జామునే మగవాళ్లంతా విల్లంబులు, కొడవళ్లు ధరించి వేటకు వెళ్లాలి. వేటకు వెళ్లే ముందు మగవాళ్లను స్త్రీలు సాగనంపే కార్యక్రమం చేస్తారు. దీంట్లో మగవాళ్లను ఉత్సాహ పరిచేందుకు గాను స్త్రీలు నృత్యాలు చేస్తారు. ఊరి పొలిమేరవద్ద వున్న దేవర దగ్గర కోడిగుడ్లు, కోడిపిల్లలను అక్కడ ఉంచి పురుషులందరినీ వరుసగా నిల్చోబెట్టి వారితో బాణాలు వేయిస్తారు. పురుషులు విల్లంబులు ఎక్కుపెట్టి గుడ్డును పగులగొడితే అడవికి వేటకు వెళ్లిన వారు విజయులై తిరిగి వస్తారనీ, లేకపోతే అడవికి వెళ్లిన వారు పరాజయం పాలవుతారని వారి నమ్మకం. ఈ కార్యక్రమం ముగిసిన తర్వాత మహిళలంతా పురుషులపై నీళ్లు చల్లుతూ హోళీ చేసుకుంటూ అడవిలోకి సాగనంపుతారు. అడవికి వెళ్లిన వారు చెట్టుపుట్ట తిరిగి ఏదోఒక అడవి జంతువును వేటాడి సాయంత్రానికి బయలు దేరతారు. వేటాడిన అడవి జంతువును తీసుకుని వచ్చి గ్రామ పొలిమేరలో ఆగి ఒకరితో గ్రామంలోకి కబురు పంపిస్తారు. దీంతో గ్రామంలో వేట జరిగిందని చాటింపు వేయిస్తారు. మహిళలంతా ఆనందంతో పసుపు, కుంకుమతో ఎదురు వెళతారు. వేటాడి తెచ్చిన జంతువును మహిళలకు అప్పగిస్తారు. వారు జంతువుకు పసుపు కుంకుమ పెట్టి పచ్చికట్టెలతో పల్లకి కట్టి ఆ జంతువును వూరేగింపుగా గ్రామంలోకి తీసుకొస్తారు. ఈ జంతువును గ్రామదేవత ముందుంచి రేలపాటలు పాడుకుంటూ నృత్యాలు చేస్తారు. జంతువును గ్రామ దేవతకు బలిచ్చేముందు సాంబ్రాణి పొగ వేస్తారు. కొందరు మహిళలు దేవత ఆవహించిందని పూనకాలు వూగుతారు. దేవతల రూపాలుగా భావిస్తూ రెండు పెద్ద వెదురు బొంగులను రంగుల దుస్తులతో అలంకరిస్తారు. ఇద్దరు వ్యక్తులు కాళ్లకు గజ్జెలు కట్టుకుని మువ్వలు పట్టుకుని వాటిని ఎత్తుకుని వూరేగుతారు. గిరిజనుల సంప్రదాయ డోలు వాయిద్యం, కొమ్ముబూర వూదుతుండగా వీరుకూడా పూనకం వచ్చిన మాదిరిగా నృత్యాలు చేస్తారు. పూజారి వీరతాడును పట్టుకుని పూజా క్రతువు నిర్వహిస్తాడు. పూజా కార్యక్రమం అనంతరం జంతువును దేవరకు బలిస్తారు. ఈ ఆనందంలో స్త్రీ, పురుషులనే భేదం లేకుండా గ్రామస్తులంతా కలిసి రేలపాటలతో నృత్యాలు చేస్తారు. బలిచ్చిన జంతువు మాంసాన్ని అందరూ వాటాలు వేసుకుంటారు. బంధు, మిత్రులతో కలిసి విప్పపూలతో చేసిన పానీయం తాగుతూ మాంసాన్ని ఆరగిస్తారు. ఆరోజు మొత్తం

గ్రామంలో పెద్ద పండుగ. ఉదయం నుండి రాత్రి వరకూ గ్రామంలో ఆటపాటలతో చిన్నా పెద్దా తేడా లేకుండా గడుపుతారు. పురుషులు స్త్రీలపై నీళ్లు చల్లి హోళీలా జరుపుకుంటారు. రాత్రికి అందరూ కలిసి రేల నృత్యాలు చేస్తారు. పెద్దలు వీర కథలు చెప్పుకుంటారు.

### వేటలో జంతువు దొరక్కపోతే..!

ఈ పండుగలో ముఖ్యఘట్టం వేట. వేటకు వెళ్లిన వారికి ఏ జంతువు దొరకకపోతే ఈ ఉత్సాహం ఉండదు. ఇవేమి లేకుండా రెండోరోజే ఏ ఆర్భాటాలు లేకుండా నిరుత్సాహంతో ఇంటికి చేరుకుంటారు. నాలుగవరోజున గ్రామపెద్ద, పూజారితో పాటు పురుషులంతా సమీపంలో ఉన్న అయ్యవారి వద్దకు వెళ్లి ఆ గ్రామంలో ఎవరిచేత మొదటగా ఏరువాక చేసి విత్తనాలు విత్తితే మంచిదో అందరిపేర్లు చెప్పి అదృష్టాన్ని పరీక్షించుకుంటారు. అయితే ఎవరిపేరున బాగుంటుందని అయ్యవారు చెబుతారో అతనితోనే ముందుగా భూమిపూజ చేయించి విత్తనాలు వేయిస్తారు. అనంతరం మిగిలినవారంతా వారివారి వ్యవసాయ పనులను ప్రారంభిస్తారు. ఈ పండుగను కొన్ని గ్రామాలలో మూడురోజుల పాటు, మరికొన్ని గ్రామాలలో వారంరోజులపాటు జరుపుకుంటారు. గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలకు, సమిష్టితత్వానికి ఈ పండుగ మచ్చుతునక అని చెప్పవచ్చు.

**పి. మట్టయ్య, ఆర్.శ్రీనివాస్,** భద్రాచలం

ఫొటోలు : **నాగేందర్‌బాబు,** వేలేరుపాడు.





డా॥ జె.పి. వైద్య

# తేనెకళ్ల 'సెక్రటరీ' రాఖీ గుల్జార్

**త్రిశూల్ భారీ బడ్జెట్ సినిమా! సంజీవ్ కుమార్, వహీదా రెహ్మాన్, అమితాబ్ బచ్చన్, శశికపూర్, హేమమాలిని, పూనమ్ ధిల్లాన్, సచిన్, ప్రేమ్ చోప్రా...ఎవరికి వారే హేమా హేమీలు పోటాపోటీగా నటించారు అందరూ! కానీ, అంత పెద్ద వాళ్ళ మధ్యలో కొట్టొచ్చినట్టు కన్పించింది 'రాఖీ'. 'గొంతు పెంచి మాట్లాడినందుకు క్షమించండి' అనే ఒక్కలైన్ డైలాగ్‌తో రాఖీ గెలిచింది. జిందగీలో 'ఇలాంటి సెక్రెటరీ ఉంటే బావుండు' అని కార్పొరేట్ ఎగ్జిక్యూటివ్స్ అనుకున్నారు.**

ఆగస్ట్ 15-1947 నాడు భారతదేశం 'అంగ్రేజోళ్ల' సంకెళ్ల నుంచి విముక్తి చెందింది. ఆనాడు ఎన్నో వింతలు, విడ్డూరాలు జరిగి ఉండొచ్చు. మనలాంటి 'సినీ వీరాభిమానులు' కూడా ఎందరో జన్మించి ఉండొచ్చు ఆనాడు. హూ కేర్స్?

ఆరోజే తేనె రంగు కళ్ల అందాల అమ్మాయి 'కేర్' మంటూ తొలిసారిగా భూమిమీద గాలి పీల్చుకుంది. తర్వాతి రోజుల్లో మనలను గాలి పీల్చకుండా కంగారు పెట్టేసింది. కానీ , మనం అలవాటు కొద్ది 'దీవానాలం' అయిపోయాం!

ఆ తేనెకళ్ల బొద్దు అమ్మాయి చిన్న వయసులోనే, తెలిసీ తెలియని వయస్సులోనే బెంగాలీ ఫిల్మ్ డైరెక్టర్ 'అజయ్ బిస్వాస్'తో వివాహబంధంలోనూ బంధిచబడింది. కొన్నాళ్లే లెండి! నమస్కారం పెట్టి హిందీ సినీ ప్రపంచంలో తన విశ్వరూపం చూయించిన కవి సామ్రాట్ - గడ్డం , కుర్తా పైజమా, దర్శకుడు 'గుల్జార్'ను పెళ్లి చేసుకుంది. వాళ్ళమ్మాయి 'బోస్కీ' నేడు దర్శకురాలిగా నిలదొక్కుకునే ప్రయత్నం చేస్తోంది. నిలదొక్కుకుంటుంది కూడా! కానీ, తేనెకళ్ల అమ్మడుగారూ, కవిగారూ ఎందుకు ఎడమొహం పెడమొహంలా విడిపోయారు? పూర్తిగా విడిపోయారా? అంటే అదీ కాదు.

కొన్నాళ్ల క్రితం 'బోస్కీ పింక్ ఫ్రాక్ ఎక్కడా?' అని వారు ఫోన్ చేస్తే 'పాప భోజనం చేసి, పాలు తాగిందా?' అని ఆవిడ కనుక్కునేవారు. మనలో కొందరికి ఇలాంటి ముచ్చట్లు ఎంతో రుచిస్తాయి.

-'భైసాబ్! ఇంత జెప్పీ సస్పెన్సుల మునగ్గొట్టకూ! ఎందంటా అసల్లొల్లి? అదర్ వుమనా? అదర్మ్యానా' ప్రశ్నించడం వారి ఆదుర్దా కావచ్చు. మనది నిఖార్సైన అభిమానం!

-'సేన్మలు చూడు(ని... మంచిగుంటే బాగుంది అనుం(డి... ఇంకా శానా బాగుంటే 'లావే జబర్‌దస్త్ భైసాబ్!' అనుం(డి... సంగీతం గురించీ, దర్శకత్వం గురించీ, ఫోటోగ్రఫీ గురించీ, పాటల సొంపుల గురించీ, కావాలంటే వంపుల గురించీ జ(రంత మాట్లాడు(ని... కానీ , నో ఎల్లో జర్నలిజం లొల్లి... అసలు సంగతేందంటే, గీ ఎల్లో, గ్రీన్, రెడ్‌ల గురించి ఏం పని ఒ(రుడూ? ఈస్ట్‌మన్ కలర్ సేన్మలున్నయి... పురానా జమాన్ల బ్లాకండ్‌వైట్ సేన్మలున్నయి. గవ్విటి గురించి 'బహస్' చేయరాదావురా తమ్మీ...!'

మన దిమాగ్ సెట్టింగ్ గిట్లనే అన్నదన్నట్టు! మనం 'పంద్రా ఆగస్ట్' నాటి 'రాఖీ' గురించి 'యాద్' చేసుకుందాం! వాళ్లిద్దరి మధ్య ఏం బెడిసిందో? బెణికిందో? తెలియదు- కానీ, రాఖీ మటుకు ప్రతి సినిమా టైటిల్స్‌లో తన పేరు 'రాఖీ గుల్జార్' గానే రాయాలని గట్టిగా చెప్పేది. బెంగాలీ భామల ముచ్చటే వేరులెండి!

మొదటి సినిమా 'బధు బరన్' 1967లో కొలకత్తాలో వచ్చింది. ఎంతో పేరు సంపాదించి పెట్టిన మొట్టమొదటి హిందీ చిత్రం 'జీవన్ మృత్యు' (70) అందులో తేనెకళ్లూ హిట్...! పాటలూ హిట్!!

కానీ , శశికపూర్‌తో1971లో వచ్చిన 'షర్మిలీ'తో రాఖీ యావత్ భారతదేశంలోని 'యువత'ను తట్టి లేపింది. అందులో 'డబుల్‌రోల్'- హేమమాలిని 'సీతా ఔర్ గీతా'లో మంచి అమ్మాయి - చెడ్డ అమ్మాయి అని అనటం ఎందుకో నచ్చదు కాబట్టి 'వ్యాంపిష్ గర్ల్' అని జారుకుంటాను.

-'ఓ మేరీ షర్మిలీ' అని శశి కపూర్ అందరినీ హాల్లో లేచి కూర్చోబెడితే రాఖీగారు 'కాంచన్/కామినీ' లుగా కళ్ళు వాలుస్తూ పాడారు. ఒళ్ళు మరచి ఆడారు. జనం బేహోష్!

'షర్మిలీ' సూపర్ డూపర్ హిట్ !

ఆ తర్వాత 1971లో సునీల్‌దత్ 'ఎడారి జీవితం గురించి నిర్మించిన 'రేష్మా ఔర్ షేరా'లో గోపాల్ భార్యగా 'రాఖీ' విమర్శకుల నోరు మూసింది. కీచుగొంతుతో గార్ఠిగా అరచి, భళ్ళున తేనెకళ్ళనిండా నీళ్ళు నింపుకుని, క్షణాల్లో ప్రేక్షకులను ఏడ్పించడం 'రాఖీ' ప్రత్యేకత అనేవారు విమర్శకులు 'ఇంకా ఏమనాలో అర్థంకాక'...

'హిస్ట్రియానిక్స్'.... అన్నారు ఉత్తరాది 'అంగ్రేజ్ దిమాగ్' విమర్శకులు.

సినీ మేగజైన్స్ కుప్పలు తెప్పలుగా పొగిడాయి. మధ్యకాలంలో చాలా సినిమాలు వచ్చాయి.

1976 లో 'కభీ కభీ' లోని 'పూజాఖన్నా' ను చూస్తూ 'అమితాబ్ బచ్చన్' గారు 'సాహిర్' పంక్తులు గున్‌గునాయించారు.

'కభీ కభీ మెరె దిల్ మే ఖయాల్ ఆతాహై!

మనం ఎప్పటిలాగే చప్పట్లు కొట్టి బేహోష్ అయిపోయి మన జీవితాల్లో ఎప్పటికైనా 'కభీ కభీ' వస్తుందా అని మనకు తెలిసిన భాషలో గొణుక్కున్నాము.

1978లో 'త్రిశూల్' వచ్చింది.







'యాంగ్రీ యంగ్ మ్యాన్' గా 'బిగ్ బి' వెండి తెర నిండా, 'పోస్టర్ల' నిండా వ్యాపించిన రోజులు అవి.

త్రిశూల్ భారీ బడ్జెట్ సినిమా! సంజీవ్ కుమార్, వహీదా రెహ్మాన్, అమితాబ్ బచ్చన్, శశికపూర్, హేమమాలిని, పూనమ్ ఢిల్లాన్, సచిన్, ప్రేమ్ చోప్రా...ఎవరికి వారే సాటి! పోటాపోటీగా నటించారు అందరూ!

కానీ, అంత మంది పెద్ద వాళ్ళ మధ్యలో కొట్టొచ్చినట్టు కన్పించింది 'రాఖీ'.

'గొంతు పెంచి మాట్లాడినందుకు క్షమించండి' అనే ఒక్క లైన్ డైలాగ్‌తో రాఖీ గెలిచింది. జిందగీలో 'ఇలాంటి సెక్రెటరీ ఉంటే బావుండు' అని కార్పొరేట్ ఎక్జిక్యూటివ్స్ అనుకున్నారు. 'ఇలాంటి అమ్మాయి జీవితంలో వస్తే బావుండు' అని ఎందరనుకున్నారో కచ్చితమైన అంకెలు నాదగ్గరలేవు. మనం తెలుగులో వచ్చిన యద్దనపూడి సులోచనా రాణి గారి 'సెక్రటరీ' ని నమిలి మరీ ఆస్వాదించి గుండెనిండా నింపుకున్నవాళ్లం. ఎంతో ఆసక్తిగా ఉత్సాహంగా వెళ్ళి చూశాం 'సెక్రటరీ'ని....

–బామ్మోయ్! నాకు ఉద్యోగం దొరికింది' అనే జయంతి నవలలోనే ఎంతో బావుందన్పించింది. కొన్ని నవలలు చదివితేనే బావుంటాయి. సినిమాలో రంగు, రుచి, వాసన 'కమర్షియల్ టచ్' తో 'బోరింగ్' అయిపోతుంటాయి.

ఏది ఏమైనా 'రాఖీస్ రోల్ యాజ్ సెక్రెటరీ ఇన్ త్రిశూల్ వజ్ మార్వలస్'...

ఆ తర్వాత శరపరంపరలా ఎన్నో చిత్రాలు వచ్చాయి. ' ముకద్దర్ కా సికందర్' లో 'కామ్నా' గా , ' కస్మేవాదే' (78)లో 'సుమన్'గా 'కాలపద్దర్' (79)లో డా॥ సుధాసేన్‌గా, 'బసేరా'(81)లో శారదా బల్‌రాజ్ కోహ్లీగా, 'శక్తి'(82)లో శీతల్‌గా, 'పరోమా' (84)లో పరామాగా , 'రామ్‌లఖన్' (89)లో శ్రీమతి శారదా ప్రతాప్ సింగ్‌గా , 'రుడాలీ'లో (93) ఖిక్రీ/యూలీగా, 'బాజీగర్'(93)లో తల్లిగా, 'బారూద్' (98)లో గాయత్రీదేవిగా, 'బాద్‌షా'(99)లో ముఖ్యమంత్రి గాయత్రీ బచ్చన్‌గా. 'దిల్ కా రిష్తా' (2003)లో శ్రీమతి శర్మగా, 'శుభ్ ముహూర్త్' (2003)లో రంగా పిషిమాగా ... ఇలా ఎన్నో పాత్రల్లో రాఖీ దర్శనమిచ్చింది. ఇప్పుడన్నీ తల్లి పాత్రలే! 'రామ్‌లఖన్' (89) – నుండి 'ఖల్‌నాయక్' (93)... 'బాద్‌షా' (99)దాకా! సోవాట్? 2003లో 'పద్మశ్రీ' పురస్కారం వరించింది. కూతురు మేఘనా (బోస్కీ) 'ఫిల్‌హాల్' అనే సినిమా దర్శకురాలిగా మారింది. భర్త గుల్జార్ 'ఛైంయా॰ ఛైంయా॰' లాంటి 'అన్‌యూజ్‌వల్ గీతాల సృష్టికర్త'. వేరుగా ఉన్నా కలిసినపుడల్లా 'బోస్కీ' గురించి ఆత్మీయంగా మాట్లాడుకుంటారు. దట్ ఈజ్ కాల్డ్ 'డిగ్నిఫైడ్ బిహేవియర్' . అన్నట్టు రాఖీ బెంగాలీ గుమ్మ కదా! చేపల పులుసు కూర స్పెషలిస్ట్! షూటింగ్‌లో తోటివారికి వండి మరీ తినిపించేది. మనం కూడా కాస్తంత డిగ్నిటీ వొంట పట్టించి 'బుకింగ్ విండో' వైపు పిచ్చెక్కినట్టు పరుగెత్తటం మానుకుంటే బావుండదూ! హూ నోస్! సినిమా గుంపులో 'త్రిశూల్' సిన్మాలో 'రాఖీ'లాంటి సెక్రటరీ ఉంటే గింటే??? సో! బి కేర్ ఫుల్!

❋

**దీనిపై మీ స్పందనను రచయితకు తెలియచేయవచ్చు.**
**ఫోన్ : 08732223622**






వీరి వీరి గుమ్మడి పండు

**జవాబు**

-------

వీరి వీరి
గుమ్మడి పండు
వీరి
పేరు
చిరంజీవి.

-------

## మనసా... తెలుసా?

హిప్నో కమలాకర్
ఫోన్ నెం: 9390044031

## ఆడా మగా స్నేహంగా వుంటే తప్పా!

నేను డిగ్రీ చదువుతున్నాను. మగపిల్లలతో స్నేహం చేసినా, తిరిగినా, మాట్లాడినా మా అమ్మ విపరీతంగా తిడుతుంది. ఒక్కోసారి కొడుతుంది కూడా. ఆడా మగా స్నేహంగా వుంటే తప్పా! మీరే చెప్పండి. నాకు చాలా బాధగా వుంది?

మమత, నాగోల్.

వయసులో ఉన్న అమ్మాయి మగ పిల్లలతో స్నేహంగా ఉంటే ముందుగా భయపడేది తల్లిదండ్రులే. పిల్లలు ఎక్కడ అడ్డదారిలోకి వెళతారోనన్న భయంతో కట్టడి చేస్తుంటారు. ఈ రోజుల్లో ఏ పేపరు చూసినా, ఏ టీవీ వార్తలు చూసినా ప్రేమ హత్యలే ఎక్కువగా కన్పిస్తున్నాయి, వినిపిస్తున్నాయి. కాబట్టి మీ అమ్మగారి బాధను అర్థం చేసుకోండి. మీ స్నేహం ఏ దోవలో వెళ్తున్నదో నిర్ణయించుకోండి. స్నేహం చేయడం తప్పు అనే కన్నా, దాన్ని వివేకంతో చక్కని పరిధులు ఏర్పరచుకోవడం అవసరం. స్నేహానికి హద్దులు లేనప్పుడు అవతలి వ్యక్తి మనల్ని తన అవసరాలకు వాడుకునే, దోపిడీకి గురిచేసే అవకాశం వుంది. ముఖ్యంగా ఆడ-మగ వయసులో పరిణతి రాని విషయంలో ఇలాంటివి ఎక్కువగా వింటూవుంటాం. స్నేహంలో దాపరికం ఉండకూడదు. మీరు మీ పరిధుల పట్ల స్పష్టమైన అవగాహన కలిగి ఉండండి. మీరు జాగ్రత్తగా ఉండగలరన్న విషయాన్ని మీ అమ్మగారికి అర్థమయ్యేలా చెప్పండి. ఎందుకంటే అమాయకంగా మగపిల్లల స్నేహానికి బలయ్యేది ఆడపిల్లలే. కాబట్టి ఏ స్నేహానికైనా స్పష్టమైన హద్దులు ఉండటం మంచిది.

## కొత్తవారితో మాట్లాడలేను

చదువులో వెనకబడ్డాను. కొత్త వారితో మాట్లాడాలంటే భయం. సిగ్గు. ఏదో ఒకరకమైన న్యూనతాభావం. ఫ్రీగా మాట్లాడలేకపోతున్నాను. దయచేసి నా సమస్యకు పరిష్కారం చెప్పి...జీవితాన్ని మార్చండి.

అనిల్, నాగర్ కర్నూల్.

కుటుంబ వాతావరణం, పెద్దలంటే భయం, మొహమాటం వున్నా సిగ్గు, భయం ఏర్పడతాయి.



దానితో చదువుకూడా సరిగ్గా చదవలేకపోతారు. మీరు ముందు మీ కుటుంబ సభ్యులతో చక్కగా మాట్లాడండి. మనసులో విషయాలు ఏమీలేకపోయినా, తెలియకపోయినా మాట్లాడలేరు. కొత్త కొత్త విషయాలు తెలుసుకోండి. న్యూస్ చదవండి. వినండి. చదువుకు సంబంధించిన విషయాలను ఏ రోజు పాఠాలను ఆ రోజే చదవండి. ఎవరేమన్నా పట్టించుకోకుండా రోజుకో కొత్త వ్యక్తితో మాట్లాడటానికి ప్రయత్నించండి. వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన పుస్తకాలు చదవండి. మీ ప్రయత్నమే మిమ్మల్ని బాగా మాట్లాడేలా చేస్తుంది.

## ఎప్పుడూ అనారోగ్యమే

నేను బాగా సెటిల్ అయ్యాను. రోజంతా ఎప్పుడూ బిజీగానే ఉంటాను. ఎప్పుడూ ఏదో ఒక అనారోగ్యం, మానసిక సమస్యలు. డాక్టర్ దగ్గరకు వెళితే, మీకు ఏమీ లేదు అంటున్నారు. నాకు సలహా ఇవ్వగలరు?

కార్తీక్, వరంగల్.

రోజుకు ఉండేది ఇరవై నాలుగు గంటలే. దానిలో కొంత సమయమైనా కుటుంబం, స్నేహితులతో గడపడానికి ఉంటుంది. కాని మనం ఫోన్ చెయ్యడానికి కూడా సమయం ఉండటం లేదనే భ్రమలో వుంటున్నాము. సాధించాల్సిన లక్ష్యాలు, పూర్తి చేయాల్సిన పనులలో పడి మానవ సంబంధాలను నిర్లక్ష్యం చేస్తున్నాము. దానితో ఎన్నో అనారోగ్య సమస్యలు తెచ్చుకుంటున్నాం. సమాజంలో ఇతరులతో సత్సంబంధాలను పెంపొందించుకోండి. పిల్లలతో ఆడుతూ కొంత సమయాన్ని గడపండి. నెలకు ఒక రోజైనా కుటుంబంతో ఎక్కడికైనా వెళ్ళి హాయిగా గడపండి. దాంతో ఆనందం, ఆరోగ్యం, మీ సొంత అవుతాయి. మీ శరీరాన్ని, మనసును అప్పుడప్పుడు పట్టించుకోండి. శరీరానికి వ్యాయామం ఎలాంటిదో మనస్సుకు పుస్తకాలు అలాంటివి. చిన్న నవ్వు, చల్లని స్పర్శ, ఒక మంచి పలకరింపు ఎన్నో మందులు తగ్గించలేని మానసిక వ్యాధుల్ని మాన్పగలవు. మీ జీవితాన్ని ఆనందంగా మార్చుకునే ఛాయిస్ మీ చేతిలోనే ఉంది.



# పునుగుల కూర

**కావలసిన పదార్థాలు**

పెసర పునుగులు-6, పెద్దవుల్లి పాయ-1, పచ్చిమిర్చి-6, మినపప్పు- 1 టీ స్పూన్, ఎండుమిర్చి-2, జీలకర్ర- కొంచెం, వెల్లుల్లి - 2 రేకులు, ధనియాలు- 1 టీ స్పూను, లవంగాలు- 1, ఆవాలు- కొంచెం, ఉప్పు- తగినంత, పసుపు- చిటికెడు, నూనె- ఉగ్గుగిన్నెడు, అల్లం -చిన్న ముక్క

**తయారు చేసే విధానం**

ఉల్లిపాయలు, పచ్చిమిర్చి, అల్లం సన్నగా తరగాలి. కడాయిలో నూనెపోయాలి. బాగా కాగిన తర్వాత మినపప్పు, తురిమిన ఎండుమిర్చి, పచ్చిమిర్చి, ఉల్లిపాయ ముక్కలు, జీలకర్ర, చితక్కొట్టిన వెల్లుల్లి, ధనియాల పొడి, లవంగాల పొడి, ఆవాలు, అల్లం ముక్కలు కొద్దిగా వేయించాలి.

ఈలోగా పెసర పునుగులు ముక్కలు చేసుకోవాలి. చిటపటలాడుతున్న పోపులో ఈ పెసర పునుగులు, కొద్దిగా వుప్పు, పసుపు చల్లాలి. మూత పెట్టేసి వుంచితే బాగా మగ్గుతుంది. ఒకటి రెండు సార్లు గరిటతో కదిపి చూడవచ్చు.

# అరటి పువ్వు ఆవకూర

**కావలసిన పదార్థాలు**

అరటి పువ్వు-1, పచ్చిమిరపకాయలు-4, కరివేపాకు- 2 రెబ్బలు, పెద్ద నిమ్మకాయంత చింతపండు, ఉప్పు- తగినంత, పసుపు- టీ స్పూను నూనె-4 టీ స్పూన్లు, పోపు సామాను- 1 టీ స్పూన్, సెనగపప్పు-1 టీ స్పూన్, మినపప్పు-1/4 టీ స్పూన్, ఆవాలు- 1 టీ స్పూన్ ఎండుమిర్చి-2, చిటికెడు ఇంగువ, మెంతి గింజలు- 4 లేక 5, నాలుగు పల్లీలు- ఆవపెట్టటానికి ఆవాలు- 1 స్పూన్ , నువ్వులు- 1 /2 టీ స్పూన్

**తయారు చేసే విధానం**

ముందుగా చేతులకు నూనె రాసుకోవాలి. అరటి పువ్వు పై దొప్పలు వలిచి అందులోని పువ్వులను వేరు చేయాలి. వేరు చేసిన పువ్వులోంచి కేసరాన్ని తీసెయ్యాలి. తర్వాత సన్నగా తరుక్కోవాలి. తగినన్ని నీళ్ళు పోసి చిటికెడు పసుపు, కొద్దిగా ఉప్పు వేసి పొంగు వచ్చేదాకా ఉడక పెట్టి వార్చాలి. ఒక బాండీలో నూనె వేడిచేసి అందులో శనగపప్పు, మినపప్పు, ఆవాలు, మెంతులు, ఇంగువ, ఎండుమిర్చి, పల్లీలు వేసి వేయించాలి. పచ్చిమిర్చి సన్నగా తరిగి అందులో వేయాలి. కరివేపాకు కూడా వేసి వేగాక ఆఫ్ చేయాలి. అందులో కడిగిన అరటి పువ్వు, చిక్కటి చింతపండు రసం, ఉప్పు, పసుపు కలపాలి. చివరగా సిద్ధంగా ఉంచుకున్న ఆవముద్దని కలిపితే మంచి సువాసనతో అరటి పువ్వు ఆవకూర సిద్ధం.

# దద్దోజనం

**కావలసిన పదార్థాలు**

బియ్యం- పావుకిలో, పెరుగు - 3 కప్పులు, పాలు-అరలీటరు అల్లం- కొంచెం, పచ్చిమిర్చి- 4, నెయ్యి- ఒక టేబుల్ స్పూన్ కరివే పాకు- రెండురెబ్బలు, పసుపు- చిటికెడు, ఉప్పు-తగినంత, మినప్పప్పు- ఒక టేబుల్ స్పూన్, మెంతులు-కొంచెం, జీలకర్ర- కొంచెం, ఆవాలు - ఒక టీ స్పూన్, ఎండు మిర్చి -4

**తయారు చేసే విధానం**

పాలు మరిగించి చల్లార్చి వుంచుకోవాలి. బియ్యం శుభ్రంగా కడిగి అన్నం వండాలి. వార్చకుండా అత్తెసరులా వండాలి. అన్నం ముద్దగా కాకుండా పొడిపొడిలాడుతుంటే మంచిది. అన్నం వుడికిన తర్వాత ఒక పళ్ళెంలో వేసి ఉప్పు, పసుపు కలిపి ఆరబెట్టాలి. పాలు పెరుగు కలిపి వుంచుకోవాలి. పాలు వేడిగా కలపకూడదు. బాగా చల్లారిన తర్వాత కలుపుకోవాలి. ఒక కడాయిలో నెయ్యిపోసి మినపప్పు, పచ్చిమిరపకాయ ముక్కలు, అల్లం ముక్కలు, మెంతులు, జీలకర్ర, ఆవాలు, కరివేపాకు వేయించుకోవాలి. ఈ పోపుని పాలు, పెరుగుతో కలపాలి. పాలూ పెరుగుని పాత్రలో వెయ్యకూడదు. పోపునే పాలూ, పెరుగూ వెన్నపాత్రలో వెయ్యాలి) మూత పెట్టి కాసేపు వుంచాలి. ఈలోగా అన్నం బాగా చల్లారుతుంది. చల్లారిన అన్నంలో పాలూ పెరుగు పోసి బాగా కలపాలి. దద్దోజనం పల్చగానూ, చిక్కగానూ కూడా వుండొచ్చు. మరీ పల్చగా వుంటే స్పూన్లతో తినవలసి వస్తుంది.



# బంగాళాదుంప కుర్మా

**కావలసిన పదార్థాలు**

బంగాళాదుంపలు- పావుకిలో, అల్లం- చాలినంత, ఉప్పు - చాలినంత పచ్చిమిర్చి- 10, గసగసాలు- కొంచెం,పెసరపప్పు- 1 టేబుల్ స్పూన్ నూనె- 2 టేబుల్ స్పూన్లు, జీడిపప్పు- 1 టేబుల్ స్పూన్, ధనియాలు- 1 టీ స్పూన్, లవంగాలు- 10,యాలుక్కాయలు-5, దాల్చిన చెక్క- కొంచెం, జీలకర్ర- కొంచెం, వెల్లుల్లి-1, పసుపు- చిటికెడు, ఎండుమిర్చి- 5

**తయారు చేసే విధానం**

బంగాళాదుంపలు బాగా వుడకబెట్టాలి. వుడికిన తర్వాత తొక్కు తీయాలి. దానిని చిన్న చిన్న ముక్కలుగా చిదిమిగాని కోసిగాని వుంచాలి. కడాయిలో నూనెపోసి బాగా మరగనివ్వాలి. అల్లం, పచ్చిమిర్చి, ఎండుమిర్చి, గసగసాలు, ధనియాలు, లవంగాలు, యాలకులు, దాల్చిన చెక్క, వెల్లుల్లి, పసుపు, ఉప్పు అన్నీ కలిపి వేయించాలి. బాగా వేగిన తర్వాత మెత్తగా నూరుకుని వుంచాలి. ఈ ముద్దని బంగాళాదుంపలతో కలపాలి. మళ్ళీ కడాయిలో నూనెపోసి శనగపప్పు, జీడిపప్పు వేయించాలి. కొద్దిగా జీలకర్ర వేసి వేయించాలి. బాగా వేగిన తర్వాత బంగాళాదుంపలను తాలింపు వేస్తే మసాలా వాసనతో ఘుమఘుమలాడుతుంది.

కుర్మాకి నీళ్ళు ఎక్కువగా వాడకూడదు. పొడి పొడిలాడుతూంటేనే బాగుంటుంది. తాలింపులో ఒక అరకప్పు చిక్కటి పెరుగు కూడా వేసుకుంటే మంచి రుచి వస్తుంది. ఇది చపాతీ, పూరి, పరోటాలతో కలిపి తింటే బాగుంటుంది.

# స్ఫూర్తిదాయక వ్యాసాలు




ఉమ్మడి భారత కమ్యూనిస్టు పార్టీ నడిపిన "సందేశం" ప్రత్యేక సంచికలోని (1957) వ్యాసాలను యథాతథంగా పాఠకులకు అందించే ప్రయత్నం ఇది. నూటయాభై సంవత్సరాల క్రితం మన దేశంలో బ్రిటిష్ సామ్రాజ్యవాద ప్రభుత్వాన్ని తుదముట్టించాలనే దృఢ సంకల్పంతో భారత ప్రజానీకం ఆయుధాలు తీసుకుని 1857లో ప్రప్రథమంగా వీరోచిత పోరాటాన్ని నడిపింది. ఈ పోరాటాల్లో రైతులు, జమీందార్లు అనే భేదం లేకుండా, పెద్ద ఎత్తున పోరాటం సాగించారు. మన హైదరాబాద్ సంస్థానాల్లోనూ కనిపించిన నాటి విప్లవ ఛాయలు, ప్రథమ భారత స్వాతంత్ర్య సమరంలో జరిపిన గెరిల్లా యుద్ధ గాథలు, స్వాతంత్ర్య వీరుల జీవిత గాథలు, తెలుగు సిపాయిల తిరుగుబాట్లు, మన పొరుగునున్న కర్నాటక ప్రాంతంలోనూ జరిపిన సాయుధ ప్రతిఘటన... మద్రాస్ సిపాయిల తిరుగుబాటు, నాటి భారత ప్రజల తిరుగుబాటుకు బ్రిటీష్ కార్మికుల అండదండలు... సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో చైనా ప్రజలకు 1857 విప్లవం చేసిన సహాయం, ఈ గ్రంథంలో మనకు స్పష్టంగా తెలుస్తాయి. అలాగే నాటి స్వాతంత్ర్య సంగ్రామ ఘటనలపై కారల్ మార్క్స్ అభిప్రాయాలు, మనకు ఎంతో అవగాహన, స్ఫూర్తీ కలిగిస్తాయి.

నాటితరం మేటి రచయితలు కంభంపాటి సత్యనారాయణ, మహీధర రామమోహన్‌రావు, టి.కె. విశ్వనాథం, దామిశెట్టి పార్థసారథి, కవులూరి వెంకటేశ్వరరావు, జేమ్స్ బ్రౌన్ తదితరుల వ్యాసాలు 150 సంవత్సరాల కిందటి ఘటనలను మన కళ్ళ ముందుంచుతాయి. కవులూరి వెంకటేశ్వరరావు రాసిన "స్వాంతత్ర్య వీరుల జీవిత గాథలు" (పుట.75), ప్రత్యేకంగా ఇచ్చిన తెలుగు సిపాయిల తిరుగుబాట్ల (1797లోనే విశాఖ వాసులతో కూడిన సిపాయిదళమొకటి గుంటూరు జిల్లాలో బ్రిటిష్ ఆఫీసర్ల ఆజ్ఞలు ధిక్కరించడం, (పుట 89), 1857లో గోదావరి జిల్లాలో కోరుకొండ సుబ్బారెడ్డి నాయకత్వాన చిన్న తిరుగుబాటు- పెద్ద సందేశం అందించిన తీరు) పాఠకుల్ని రోమాంచితులను చేస్తాయి. ప్రతి విద్యార్థి, యువతీయువకులు చదివి తీరాల్సిన గ్రంథం ఇది. చరిత్ర అధ్యయన విద్యార్థులకు ఇది చక్కటి పాఠ్య గ్రంథంలా పని చేస్తుంది. సినీ స్టార్స్ గురించిన ఉపవాచకాలు, వాచకాలు, నేడు వస్తున్న వేళ ఇలాంటి గ్రంథాలు అరుదుగా లభిస్తాయి. నాటి త్యాగధనుల కథలు... చరితలు స్ఫూర్తి కలిగిస్తాయి.

భారతదేశంలో దత్తతాధికారం లేకుండా చేసేందుకు నాటి బ్రిటిష్ అధికారి 'డల్హౌసి' పన్నిన పన్నాగాన్ని నానాసాహెబ్ పీష్వా, లక్ష్మీబాయి ఎలా వీరోచితంగా ఎదుర్కొన్నారో మనం ఈ పుస్తకంలో తెలుసుకోవచ్చు... అతివాదుల యుగం, మితవాదుల యుగం, మాస్ మూమెంట్‌గా గాంధీ యుగం (1917-1947)... గురించి, తప్పక తెలుసుకోవాల్సిన అంశాలు. అయితే నాటి సంచికల్నే యథాతథంగా ముద్రించడం వల్ల (స్కాన్ చేసి) వృద్ధులకు, కంటి చూపు తగ్గిన వారికి ఈ గ్రంథంలోని చిన్న అక్షరాలు... చదవడం కొంచెం ఇబ్బంది కరంగానే ఉంటుంది. ఏమైనా నాటి త్యాగ పూరిత చరిత్రల్ని మళ్ళీ మన ముందుకు తెచ్చిన ప్రచురణకర్తల్ని అభినందించాలి.

**1857 ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామం: చారిత్రక ప్రాముఖ్యత,**
**పేజీలు: 116/-, వెల: 75,**
ప్రతులకు: విశాలాంధ్ర బుక్ హౌస్ అన్ని బ్రాంచీలు.

**తంగిరాల చక్రవర్తి**




రావులపల్లి సునీత

**డెత్ సెంటెన్స్**

వినోదం, వికాసం, విజ్ఞానం అందించే నవల!
వెల:100/-,
పేజీలు:333
ప్రతులకు:
విశాలాంధ్ర బుక్ హౌస్,
అబిడ్స్ & సుల్తాన్ బజార్, హైదరాబాద్.

**తెలంగాణా విమోచనోద్యమం సాహిత్యం**

డా॥ఎస్వీ సత్యనారాయణ
వెల:50/-,
పేజీలు:119
ప్రతులకు:
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, ప్రజాశక్తి,
దిశ, నవోదయ,
సహచర
అన్ని బ్రాంచీలు.

## POLITICS AND POLICIES




A Marxist Perspective
Prakash Karat
Price :200/-
Pages: 388
For Copies
Prajasakti Book House
H.No.1-1-187/1/2,
Viveknagar
Chikkadpally,
Hyderabad-20
All Branches.

A Directory of
**ELDER'S HOMES IN ANDHRA PRADESH 2008**
**పెద్దల వసతి గృహములు**




Price :35/-
Pages: 166
Copies
FAPSCO C/o.IFHD
12-13-705/10/AB, Balaji Residency
Gokulanagar, Tarnaka, Hyderabad-17.

# కమలాకృతులు

అసలు ఆలోచనలకు అవధులు లేవా అనిపిస్తుంది ఈ కమలాకృతులు చూస్తుంటే. అదేనండీ కమలాపళ్లతో చేసిన ఆకారాలు కాబట్టి కమలాకృతులన్నాం. ఓ పెద్దమనిషికి కంటి ముందర కావాల్సినన్ని కమలాపళ్లు కనిపించాయి. మనసులో ఏవేవో ఆకారాలు మెదిలాయి. వాటికి రూపం ఇస్తే...ఇదిగో ఇలా మీ ముందున్న ఆకృతులు సాక్షాత్కరించాయి. సూపర్‌గా వున్నాయికదూ.

# మాటే మంత్రమూ

సాహిల్. కె

అబ్బో... ఇది చాలా పాతకాలం నాటి సంగతి. అప్పట్లో ఒక ఊరి నుంచి మరో ఊరు వెళ్లాలంటే కాలినడకన అడవులు దాటుకుని వెళ్లడమే గతి. ఓసారి ఓ బ్రాహ్మణుడు పొరుగూళ్లో పూజలు పునస్కారాలు చేయడానికి వెళ్లాడు. అక్కడ ఓ పేదవాడు ఇతనితో వ్రతం చేయించుకుని...తన దగ్గర వున్న మేకపిల్లను సమర్పించుకున్నాడు. బ్రాహ్మణుడు దాన్ని నెత్తిమీద పెట్టుకుని ఇంటికి బయలుదేరాడు. అలా అడవిలో నడుస్తూ వుంటాడు.

ముగ్గురు దొంగలు బ్రాహ్మణుణ్ణి, అతని నెత్తిమీద వున్న మేకను చూస్తారు. వారికి వెంటనే ఒక ఆలోచన వస్తుంది. "మేక మాంచి కండపట్టి వుంది. దాన్ని కనక మనం కొట్టేస్తే...హాయిగా ఓరోజంతా సుష్టుగా మేకమాంసం లాగించొచ్చు. మాంసం తిని ఎన్నిరోజులైందో...!" అని కూడబలుక్కుంటారు.

ఆ వెంటనే ముగ్గురూ వేగంగా బ్రాహ్మణుడు చూడకుండా పొదల మాటుగా ముందుకు పరిగెట్టుకుంటూ వెళతారు. ముగ్గురూ మూడు చోట్ల చెట్ల చాటున నక్కివుంటారు. బ్రాహ్మణుడు తన దగ్గరకు రాగానే మొదటి దొంగ...

"ఏవండీ వంతులుగారూ! బావున్నారా? పొరుగూళ్లో పూజ చేయించి వస్తున్నట్టున్నారే. అది సరేగాని. ఏంటండీ మరీను. మీరు ఇంత పండితులైవుండి ఒక కుక్కను నెత్తికి ఎత్తుకుని మోస్తున్నారు. మీకేం ఖర్మండీ. దించండి దించండి..." అంటాడు.

మేకను కుక్క అన్నందుకు అతగాడి మీద బ్రాహ్మణుడికి విపరీతమైన కోపం వస్తుంది. చికాగ్గా..."ఏం పట్టపగలే బాగా తాగి వున్నావా? తిక్కతిక్కగా మాట్లాడుతున్నావు. ఇది కుక్క కాదు. మేక. బాగా చూడు" రుసరుసలాడుతూ వెళ్లిపోతాడు.

అలా కొంత దూరం వెళ్లాక రెండవ దొంగ ఎదురుపడి..."ఏవండీ అయ్యోరూ! పక్కూరికెళ్లొస్తున్నారా? వ్రతాలేవైనా చేయించొస్తున్నారా ఏంటి? అయ్యో అయ్యోరూ! అదేంటి ఛండాలంగా చచ్చిన దూడను నెత్తిమీద పెట్టుకొని మోసుకొస్తున్నారు? అయినా నాకెందుకులెండి! మీరు ఎట్టైనా పండితులు. నేను మీకు చెప్పదగిన అంతటివాణ్ణి కాదనుకోండి" అంటాడు.

"మొదట ఎదురైనవాడు కూడా ఇలాగే కూశాడు. ఇప్పుడు వీడూ అంతే" అనుకుని కాస్త ఆలోచనలో పడ్డా...తేరుకొని "ఛీ ఛీ...! అప్రాచ్యుడా. లక్షణంగా ప్రాణంతో వున్న మేకపిల్లను పట్టుకుని చచ్చిన దూడంటావేంటి? కళ్లు పోయాయా..." అంటూనే ఆలోచిస్తూ ముందుకు నడిచాడు.

అలా అన్నాడేగాని అతని మనసులో ఒకటే అనుమానం మొదలైంది. "ఇప్పటి వరకు ఎదురైన ఇద్దరూ ఒకరికొకరు తెలియదు. అలాంటిది ఇద్దరూ నేను తీసుకెళ్తున్న మేకను మేక కాదంటారేంటి? ఒకడేమో కుక్కంటాడు. మరొకడేమో చచ్చిన దూడంటాడు. ఎందుకిలా! ఒకడైతే అబద్ధం చెప్పాడనుకోవచ్చు. మరి రెండోవాడు కూడా చెప్పాడంటే ఏమనుకోవాలి?" అనుకుంటూ ముందుకు నడుస్తుంటాడు. ఈలోగా మూడవ దొంగ ఎదురుపడి...

"ఏవండీ మాష్టారూ! మేక పిల్లనుకొని గాడిద పిల్లను నెత్తిమీద పెట్టుకొని తీసుకెళ్తున్నారా ఏంటి? ఎవరైనా చూస్తే నవ్విపోగలరు. ఇలా ఇవ్వండి. ఆ అవమానాలేవో నేను పడతాను. మీ ఇంటిదాకా దాన్ని నేను మోసుకొస్తాను. ఇలా ఇవ్వండి" అన్నాడు చాలా చొరవగా.

మూడవ వ్యక్తి కూడా అలా అనేసరికి బ్రాహ్మణుడికి తన మెదడులో వున్న అనుమానం మరింత పెరిగిపోయి...

"ఛీ... గాడిదను మోసుకెళ్లాల్సిన దౌర్భాగ్యం నాకేంటి? ఇదిగో ఆ దరిద్రాన్ని నువ్వే మోసుకెళ్లు..ఏదో ఒకటి చేసుకుచావు" అంటూ గాడిదను కింద వదిలేసి వెళ్లిపోతాడు.

దానికోసమే ఎదురుచూస్తున్న దొంగ సంతోషంగా..."పథకం పారింది. పిచ్చి బ్రాహ్మణుడు మేకను మేక కాదంటే నమ్మేశాడు. మరి చిన్ననాటినుంచి ఔపోసన పట్టిన పాండిత్యం అంతా ఏమైందో ఏమో! ముగ్గురు చెప్పిన తప్పుడు మాటలను నమ్మేసి తన చేతలో వున్న మేకను వదిలేశాడు.... ఏమైతేనేం ఇవాళ సుష్టుగా మేక మాంసంతో భోజనం చేయాలి" అనుకుంటూ నేస్తాల దగ్గరకు బయలుదేరాడు.